ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి

జిల్లా వార్తలు

5★

శుక్రవారం 31 జనవరి 2025

రైతు భరోసా కోసం దరఖాస్తు చేసుకోవాలి

రాజు, వ్యవసాయ విస్తీర్ణ అధికారి



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: సుల్తానాబాద్ మండలంలో ఎంత మందికి రైతు భరోసా పథకం వర్తిస్తుంది

ఏఈవో: మండలంలో 16 వేల 720 మంది రైతులు అర్హులైన వారుండగా ఇప్పటి వరకు 15,691 మందికి రైతు భరోసా పథకం ద్వారా పెట్టుబడి డబ్బులు వారి ఖాతాలో జమ అవుతున్నాయి. ఇంకా 680 మంది కొత్తవారు ఉన్నారు.

ఆంధ్రజ్యోతి: కొత్త వారు ఎలా దరఖాస్తు చేసుకోవాలి

ఏఈవో: 1 జనవరి 2025కు ముందు పట్టాదారు పాసుబుక్కులు జారీ అయిన రైతులు కొత్తగా రైతు భరోసా కోసం దరఖాస్తులు చేసుకోవాలి. పాసుబుక్కు, బ్యాంకు ఖాతా బుక్కు, ఆధార్ కార్డు జిరాక్స్‌తో రైతు వేదికల్లో అందుబాటులో ఉన్న ఏఈవోలకు దరఖాస్తులను సమర్పించాలి.

ఆంధ్రజ్యోతి: రైతు భరోసా మండల వ్యాప్తంగా అమలవుతుందా?

ఏఈఓ: కొత్త ప్రభుత్వం వచ్చాక సవరించిన నిబంధనల మేరకు రైతు భరోసా పథకాన్ని అమలు చేస్తుంది. జనవరి 26 నుంచి ప్రారంభించారు. పైలట్ ప్రాజెక్టుగా కేవలం మండలంలోని ఒకే గ్రామాన్ని ఎంపిక చేసి అక్కడి రైతులకు మాత్రమే రైతు భరోసా డబ్బులు జమ చేశారు. కాట్నపల్లిలో ఇప్పటి వరకు 606 మంది రైతులను గుర్తించి వారి ఖాతాల్లో రూ. 57లక్షల 60వేల 484 రూపాయలను జమ చేసింది. **- సుల్తానాబాద్**

నిఘా నీడలో.. ఇంటర్ ప్రాక్టికల్స్



- ప్రభుత్వ ప్రైవేట్ కళాశాలల ప్రయోగశాలల్లో సీసీ కెమెరాలు
- ఫిబ్రవరి 3 నుంచి 20 రోజుల పాటు పరీక్షలు
- వ్యతిరేకిస్తున్న ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలను ఈసారి మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా నిఘా నీడలో నిర్వహించేందుకు ఇంటర్మీడియెట్ బోర్డు ఏర్పాట్లు చేస్తున్నది. ఫిబ్రవరి 3 నుంచి 20 రోజుల పాటు జరిగే ఈ పరీక్షలపై నిఘాను పటిష్టం చేసింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా సీసీ కెమెరాల నిఘాలో ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టింది. ఈ మేరకు ఏర్పాట్లు చేసుకోవాలని ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య జిల్లాలోని ఇంటర్మీడియట్ అధికారులు, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, మోడల్ స్కూల్స్, కస్తూర్బాగాంధీ విద్యాలయాల్లోని ప్రయోగశాలలు గల గదుల్లో సీసీ కెమెరాలను బిగించే పనిని హైదరాబాద్‌లోని ఒక సంస్థకు అప్పగించింది. ఇందు కోసం ఒక్కో కళాశాలకు ప్రభుత్వం 12 వేల రూపాయలు కేటాయించింది. ఆమేరకు జిల్లాలో గల కళాశాలల్లో సీసీ కెమెరాలను బిగిస్తున్నారు.



కమాన్‌పూర్ జూనియర్ కళాశాలలో ప్రయోగాలకు సిద్ధం చేసిన రసాయనాలు

జిల్లాలో 14 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, 13 ప్రైవేట్ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. సైన్స్ గ్రూపులు బోధించే ఆరు మోడల్, కస్తూర్బాగాంధీ విద్యాలయాలు ఉన్నాయి. ఈ కళాశాలల్లో ఇంటర్ బైపీసీ, ఎంపీసీ, ఎంఈసీ, ఇతర వొకేషనల్ కోర్సుల్లో ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు 5,220 మంది ఉన్నారు. వీరంతా ప్రాక్టికల్ పరీక్షలు రాయాల్సి ఉంటుంది. ఇందుకోసం 33 కళాశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు.

● ప్రతీ కళాశాలకు రూ. 25 వేలు..

ప్రతీఏటా ప్రభుత్వ ఇంటర్ కళాశాలల్లో విద్యార్థులకు ప్రయోగ పాఠాలు బోధించేందుకు అధ్యాపకులు పడుతున్న ఇబ్బందులను గమనించిన ప్రభుత్వం ఈసారి ప్రతీ కళాశాలకు 25 వేల రూపాయలను గత నెలలో కేటాయించింది. ఆ మేరకు భౌతిక, రసాయన శాస్త్రాలు, జంతు, వృక్ష శాస్త్రాల ప్రయోగాల కోసం కావాల్సిన పరికరాలు, రసాయనాలను కళాశాలల్లో సమకూర్చారు. దీంతో నెల రోజుల నుంచి అధ్యాపకులు విద్యార్థులకు ప్రయోగ పాఠాలు బోధిస్తున్నారు.

కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం..

జూనియర్ కళాశాలల్లో ఏర్పాటు చేసే సీసీ కెమెరాలను హైదరాబాద్‌లో గల ఇంటర్మీడియట్ బోర్డు కమాండ్ కంట్రోల్ కేంద్రానికి అనుసంధానం చేయనున్నారు. అక్కడ ఒక బృందం ఈ కెమెరాల ద్వారా పరీక్షలు జరుగుతున్న తీరును పర్యవేక్షించనున్నారు. ప్రాక్టికల్స్ నిర్వహించే గదుల్లో రెండేసి చొప్పున వీడియోతో పాటు వాయిస్ రికార్డింగ్‌తో కూడిన సీసీ కెమెరాల ఏర్పాటుకు ఆదేశాలిచ్చారు.

జిల్లాలో సుమారు 5,220 మంది ప్రాక్టికల్ పరీక్షలకు హాజరవుతారు. ప్రశ్నాపత్రం ఏ రోజుకారోజు ప్రిన్సిపాల్ లాగిన్‌కు మెయిల్‌లో రావడంతోనే దానిని సీసీ కెమెరాల పర్యవేక్షణలో ప్రింట్ తీసుకొని విద్యార్థులకు అందిస్తారు. అక్రమాల నిరోధానికి మునుపెన్నడూలేని విధంగా ఇంటర్ బోర్డు ఈ నిర్ణయం తీసుకున్నది. ఈ నేపథ్యంలో పలు కళాశాలల యాజమాన్యాలు ఆగమేఘాల మీద సీసీ కెమెరాల బిగింపు, మిగతా 8వ పేజీలో

కల సాకారమవుతున్న వేళ

- గోదావరినదిపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి అటవీశాఖ అనుమతి
- డిసెంబరులో శంకుస్థాపన చేసిన సీఎం రేవంత్‌రెడ్డి
- అనుమతుల కోసం మంత్రి శ్రీధర్‌బాబు ప్రత్యేక కృషి



మంథని పట్టణ శివారులోని మంథని-శివ్వారం మధ్య ఉన్న గోదావరి నదిపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి కేంద్ర అటవీశాఖ కండిషనల్ క్లియరెన్స్ ఇచ్చింది. గోదావరినదిలో ఎల్. మడుగు వన్యప్రాణుల-మొసళ్ల సంరక్షణ కేంద్రం ఉండటంతో బ్రిడ్జి నిర్మాణానికి ఫారెస్టు క్లియరెన్స్ రావడంపై కొంత సందిగ్ధం ఏర్పడింది. పలుమార్లు రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేయడంతో ఎట్టకేలకు కేంద్ర అటవీశాఖ అనుమతి ఇచ్చింది. దీంతో వంతెన నిర్మాణానికి మార్గం సుగుమమైంది. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ప్రజల కల నెరవేరనున్నది. 7లో

ఎల్లప్పుడూ ప్రజాసేవకుడిగా ఉంటా

- ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

కాల్వశ్రీరాంపూర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఎల్లవేళలా ప్రజాసేవకుడిగా ఉంటూ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం గురువారం జరిగింది. సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ చివరి ఆయకట్టు ప్రాంతాలకు శాశ్వతంగా తాగునీరు అందించేందుకు పత్తిపాక రిజర్వాయర్ ప్రాజెక్టు నిర్మాణం పూర్తిచేసి కాల్వశ్రీరాంపూర్ హుస్సేన్‌మియా వాగుకు నిరంతరం సాగునీరు అందస్తామన్నారు. కాల్వశ్రీరాంపూర్ నుంచి పొత్కపల్లి, గుంపుల, తనుగుల రోడ్డు పనులకు నిధులు మంజూరు కాగా పనులు నడుస్తున్నాయన్నారు. వెన్నంపల్లి రింగ్‌రోడ్డుకు ఏడుకోట్లు మంజూరు చేశానని త్వరలో పనులు ప్రారంభించినట్లు తెలిపారు. గుంటిమడుగు ఎత్తిపోతల పథకానికి కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్లు, రామిడి తిరుపతిరెడ్డి, మినపాల ప్రకాశ్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ రాంచంద్రారెడ్డి, గ్రంథాలయ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్, మాజీ జడ్పీటీసీ లంక సదయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య తదితరలుపాల్గొన్నారు.

● హుస్సేన్‌మియా వాగు పరిశీలన

కాల్వశ్రీరాంపూర్ మండలంలోని చిన్నరాతుపల్లి గ్రామశివారులో హుస్సేన్‌మియా వాగులోకి వస్తున్న నీటిని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు పంటలు ఎండకుండా ఎస్సారెస్పీ ప్రాజెక్టు నుంచి హుస్సేన్‌మియా వాగుకు సాగునీరు సంబంధిత అధికారులతో మాట్లాడి విడుదల చేశామని తెలిపారు.

విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరం

- పాఠశాలలో రూరల్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకు సన్నాహాలు
- మా బడి మా దగ్గరే ఉండాలంటున్న గ్రామస్థులు



బంధంపల్లి ప్రభుత్వ పాఠశాల

పెద్దపల్లిటౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయడంతో విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది. పెద్దపల్లి జిల్లాలో మూడు పోలీస్ స్టేషన్లను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్లో మహిళా పోలీస్ స్టేషన్, బంధంపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రూరల్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయనున్నారు. అయితే బంధంపల్లి పాఠశాలలో ఏర్పాటును స్థానికులు వ్యతిరేకిస్తున్నారు. ఆ పాఠశాలలో ఒకటి నుంచి ఐదో వరగతి వరకు ఉంది. ఇందులో 20 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఇద్దరు టీచర్లుండగా ఇటీవల ఓ టీచర్ బదిలీపై వెళ్లారు. దీంతోపాటు ఇందులో అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. 14మంది పిల్లలున్నారు. పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తే విద్యార్థుల భవిష్యత్తు ఏమిటని గ్రామస్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. కూలీనాలీ చేసుకొని బతికే మేం పిల్లలను బస్సుల్లో, ఆటోల్లో పంపలేమని పేర్కొంటున్నారు. పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయకుండా అడ్డుకునేందుకు గ్రామస్థులు ఏకమవుతున్నారు. ఏ ఎన్నికలు వచ్చినా ఇదే పాఠశాలలో నిర్వహిస్తారు.



అంగన్‌వాడీ కేంద్రంలోని విద్యార్థులు

● స్థలం సరిపోదు..గదులు సరిపోవు

బంధంపల్లి ప్రభుత్వ పాఠశాలలో శిథిలావస్థలో మూడు గదులున్నాయి. వీటిలో తరగతులు నిర్వహించడం లేదు. మరో రెండు గదుల్లో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు నడిపిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఒక వరండా ఒకే గది ఉంది. రెండు గుంటల స్థలం ఉండడంతో పోలీస్‌స్టేషన్‌కు కొత్త భవనం నిర్మించినా స్థలం సరిపోదు.

మా పిల్లలను ఎక్కడ చదివించాలి

- ఈరవేన కళ్యాణి



మా పిల్లలను ఎక్కడ చదివించాలో అర్థం కావడం లేదు. మా బడి మా ఊరి లోనే ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. దూరమైతే పిల్లలకూ మాకు ఇబ్బందే.

ఠాణా ఏర్పాటును అడ్డుకుంటాం

ఈరబోయిన శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్



పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయకుండా గ్రామస్థులమంతా అడ్డుకుంటాం. పురాతన కాలం నుంచి బడిని ఎత్తివేసి రూరల్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయడం సరికాదు. మా బడి మా దగ్గరే ఉండాలనే నినాదంతో ముందుకు సాగుతాం.

హక్కులపై అవగాహన పెంచుకోవాలి

ఓదెల, జనవరి 30(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పిల్లల హక్కులు, మహిళల హక్కులపై అవగాహన పెంచుకోవాలని మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ అరుణ సూచించారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ హైస్కూల్లో విద్యార్థులకు పలు హక్కులపై చట్టాలపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణ మాట్లాడుతూ, ఆడపిల్లల సంరక్షణ, లింగ నిర్ధారణ, పిల్లల హక్కులు, చట్టాలు, మహిళల హక్కుల గురించి వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సుశీల, ఉపాధ్యాయులు సుమలత, సునీత, కావ్య, అనుశ్రీ, బాలల పరిరక్షణ కమిటీ సభ్యురాలు వంగల శ్యామల తదితరులు పాల్గొన్నారు.

ఇసుక రవాణా రికార్డులను వెల్లడించండి

ఓదెల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో టీఎస్ఎండీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇసుక రీచ్‌ల్లోని రవాణా లెక్కలు, సంబంధిత రికార్డులను వెల్లడించాలని మానేరు పరిరక్షణ కమిటీ ప్రధాన కార్యదర్శి చిటికేసి సతీష్ అధికారులను కోరారు. గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. సుప్రీం కోర్టు జనవరి 27న స్టాక్ యార్డుల నుంచి తరలించిన ఇసుక నిల్వలకు సంబంధించిన వివరాలు ఆరు వారాల్లోగా ఉన్నత న్యాయ స్థానంలో సమర్పించాలని రాష్ట్ర మైనింగ్ శాఖను ఆదేశించారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు ఇసుక లెక్కలను ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు.

ఎన్నికల కోడ్ కట్టుదిట్టంగా అమలు

- కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి టౌన్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): శాసనమండలి సభ్యులు ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ఎమ్మెల్సీ ఎన్నికలపై సంబంధిత అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్ మెదక్, ఆదిలాబాద్ పట్టభద్రులు, టీచర్స్ శాసనమండలి సభ్యుల స్థానానికి ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసిందన్నారు. ఫిబ్రవరి 3న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అవుతుందని, ఫిబ్రవరి 27న పోలింగ్ జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి కట్టుదిట్టంగా అమలు చేయాలని, రాజకీయ పార్టీలకు సంబంధించిన హోర్డింగులు, వాల్ రైటింగ్‌లు, జెండాలు, ప్రకటనలు తొలగించాలని ఆదేశించారు. మండలాల్లో పెండింగ్‌లో ఉన్న పట్టభద్రులు, టీచర్స్ ఓటరు నమోదు దరఖాస్తులను త్వరగా పరిష్కారించాలని సూచించారు. గురుకులాల్లో ప్రవేశాలకు సంబంధించి ఆన్‌లైన్ అడ్మిషన్‌లు ఫిబ్రవరి 1 చివరి తేదీ ఉన్నందును విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా తహసీల్దార్ల వద్ద పెండింగ్‌లో ఉన్న ఆదాయ, కుల, నివాస, సర్టిఫికెట్లు ఈ నెల 31 లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో రెవెన్యూ డివిజన్ అధికారులు గంగయ్య, సురేష్, తహసీల్దార్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఏఐపై అవగాహన సదస్సు

రామగిరి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం సాయంత్రం ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)పై విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్(ఏఏఐఐ) హైదరాబాద్ చాప్టర్ 68వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జేఎన్టీయూ మంథని కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఏఏఐఐ హైదరాబాద్ చాప్టర్ చైర్మన్ ఎం ప్రభాకర్‌రావు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భార్గవ్ ముఖ్యఅతిథిగా పాల్గొని ఏఐపై అవగాహన కల్పించారు. కృత్రిమ మేధ ఎందుకు వాడాలి, ప్రయోజనాలు అనే అంశంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఏఐఈ సెక్రెటరీ చంద్రశేఖర్, సింగరేణి జీఎంలు సుధాకర్‌రావు, వెంకటయ్య, కళాశాల ప్రిన్సిపల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

రుణమాఫీపై మంత్రికి వినతి

రామగిరి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగేపల్లిలో కేడీసీసీ బ్యాంక్‌లో రుణాలు పొందిన 54 మంది రైతులకు రుణామాఫీ కాలేదని, పరిష్కారం చూపాలని కోరతూ గురువారం రాత్రి మాజీ జడ్పీటీసీ గంట వెంకటరమణరెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని వివిధ ప్రాంతాలకు చెందిన కేడీసీసీ బ్యాంక్ ఖాతా రైతులు మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. దీంతో మంత్రి ప్రిన్సిపల్ సెక్రెటరీ రఘునందన్‌కు ఫోన్ చేసి రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ వెము కనకయ్య, మేకల మారుతీ యాదవ్, మామిడి హరీష్, గొర్రె కొమురయ్య, వెము అంజి, బుద్దుల జగదీశ్వర్, రైతులు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ





గోదావరిఖని, మంథనిలో గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్, పుట్ట మధు

మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్

గోదావరిఖని, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఎన్నో హామీలు ఇచ్చి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ అన్నారు. 420 హామీలు 420 రోజుల కాంగ్రెస్ ప్రభుత్వ మోసపూరిత పాలనకు నిరసనగా, మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం గోదావరిఖని పట్టణంలో మహాత్మాగాంధీ విగ్రహానికి చందర్ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ 420 బూటకపు హామీలను ఇచ్చిందన్నారు. హామీలను అమలు చేసేలా మహాత్ముడు కాంగ్రెస్ పార్టీకి బుద్ధి ప్రసాదించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ ఎస్ నాయకులు మూల విజయారెడ్డి, మాజీ కార్పొరేటర్లు కుమ్మరి శ్రీనివాస్, గాధం విజయ, కల్వచర్ల కృష్ణవేణి, బాది అంజలి, శివకుమార్ నాయకులు నారాయణదాసు మారుతి, బొడ్డు రవీందర్, బొడ్డుపల్లి శ్రీనివాస్, రాకం వేణు, అచ్చే వేణు, తోట వేణు పాల్గొన్నారు.

మంథని: అధికారం కోసం ఆరు గ్యారెంటీలు, 420 హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ హామీలను అమలు చేయకుండా 420 రోజులు గడిపేసిందని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఆరోపించారు. స్థానిక గాంధీచౌక్‌లోని గాంధీ విగ్రహానికి ఎన్నికల హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రాన్ని అందజేశారు. బీఆర్ఎస్ నేతలు ఏగోలపు శంకర్‌గౌడ్, తగరం శంకర్‌లాల్, జంజర్ల శేఖర్, పుప్పాల తిరుపతి, కనవేన శ్రీనివాస్, కాయితి సమ్మయ్య పాల్గొన్నా రు.

సుల్తానాబాద్: ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పాలకులపై కేసులు నమోదు చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, పౌర సరఫరాల సంస్థ మాజీ చైర్మన్ రవీందర్ సింగ్ అన్నారు. సుల్తానాబాద్‌లో బీఆర్ఎస్ నాయకులు నిరసన చేపట్టారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పారుపల్లి గుణపతి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బుర్ర శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

● గద్దర్ విషయంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు ఖండిస్తున్నట్లు రవీందర్‌సింగ్ అన్నారు.

ధర్మారం: మండల కేంద్రంలో జరిగిన నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాచూరి శ్రీధర్, నాయకులు ముత్యాల బలరాంరెడ్డి, పూస్కూరి జితేందర్, కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, పెంచాల రాజేశం, రాజయ్య, పాల్గొన్నారు.

కమాన్‌పూర్: మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ శంకర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ శంకర్, మండల యూత్ అధ్యక్షుడు బొమ్మగాని అనిల్‌గౌడ్, మహిళ విభాగం మండల అధ్యక్షురాలు పొన్నం రాజేశ్వరి, మాజీ వైస్ఎంపీపీ ఉప్పరి శ్రీనివాస్ యాదవ్, ఏఎంసీ మాజీవైస్ చైర్మన్ గుర్రం లక్ష్మీమల్లు, మాజీ సర్పంచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

కొడుకుపై గొడ్డలితో తండ్రి దాడి

జమ్మికుంట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని గణేష్‌నగర్‌లో కొడుకుపై తండ్రి గొడ్డలితో దాడిచేసి గాయపరిచాడు. వివరాల్లోకి వెళితే.. గణేష్‌నగర్‌కు చెందిన అర్కల మల్లయ్య-బుచ్చమ్మ దంపతులకు ఇద్దరు కుమారులున్నారు. చిన్న కుమారుడు లోకేష్ పట్టణంలోని ఓ మొబైల్‌షాపులో పనిచేస్తున్నాడు. అతడు మద్యానికి బానిసై వృద్ధుడైన తండ్రి మల్లయ్యను తరుచూ కొడుతూ ఉండేవాడు. అడిగినప్పుడు డబ్బులు ఇవ్వకుంటే చంపుతానని బెదిరింపులకు గురిచేశాడు. దీంతో భయాందోళనకు గురైన తండ్రి మల్లయ్య తన కొడుకు బతికి ఉంటే తనను బతకనివ్వడని భావించాడు. ఎలాగైనా చంపాలని నిర్ణయించుకున్నాడు. తెల్లవారు జామున 3గంటల సమయంలో ఇంట్లో నిద్రిస్తున్న కొడుకు తలపై గొడ్డలితో వేటువేశాడు. తీవ్రగాయాలపాలై ప్రాణపాయ స్థితిలో ఉన్న లోకేష్‌ను కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు లోకేష్ తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.

పంచాయతీ కార్యాలయంలో అగ్నిప్రమాదం

జమ్మికుంట రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం మడిపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో అగ్ని ప్రమాదం జరిగింది. పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న పాత రిక్షాకు మొదట నిప్పంటుకోగా మంటలు పంచాయతీ కార్యాలయానికి వ్యాపించాయి. ఈప్రమాదంలో రికార్డులు దగ్ధం అయ్యాయని కార్యదర్శి మూగల అంజిరెడ్డి గురువారం పోలీస్‌లకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.

యువతి అదృశ్యం.. కేసు నమోదు

జమ్మికుంట, జనవరి 30(ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని 16వ వార్డుకు చెందిన కావ్య గురువారం అదృశ్యం అయింది. కావ్య హన్మకొండలోని ఓ డిగ్రీకళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతోంది. సంకాంత్రి పండుగకు సెలవుల నిమిత్తం స్వగ్రామం జమ్మికుంటకు వచ్చింది. గురువారం ఉదయం 10గంటల సమయంలో షాపునకువెళ్లి వస్తానని ఇంట్లోచెప్పి బయటకు వెళ్లింది. సాయంత్రం అయినా ఇంటికి తిరిగి రాలేదు. బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినా ఫలితం లేకుండా పోయింది. తల్లిరమాదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.

చోరీ కేసులో ఇద్దరు అరెస్ట్

ఎల్లారెడ్డిపేట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ గ్రామంలోని ఓ ఇంటిలో చోరీ కేసులో అదే గ్రామానికి చెందిన అక్కపల్లి సంజీవ్, పెద్దోళ్ల మనోజ్‌లను గురువారం అరెస్ట్ చేశామని ఎస్ఐ రమాకాంత్ తెలిపారు. నిందితుల వద్ద నుంచి రూ.4వేల నగదును స్వాధీనపర్చుకున్నామన్నారు. ఎస్ఐ రమాకాంత్ కథనం ప్రకారం.. గ్రామంలోని వంగాల లక్ష్మారెడ్డి తండ్రి మోహన్‌రెడ్డి ఈనెల 24న అనారోగ్యంతో మృతిచెందాడు. అప్పటి నుంచి తన ఇంటికి తాళం వేసి గ్రామంలోని ఓ గదిని అద్దెకు తీసుకుని కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తున్నాడు. ఈనెల 27న రాత్రి తాళం వేసి ఉన్న ఇంటిలో గుర్తుతెలియన వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. రూ.10వేల నగదును తస్కరించారని పేర్కొంటూ ఈ నెల 28న బాధితుడు లక్ష్మారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అదే గ్రామంలోని సంజీవ్, మనోజ్‌లపై అనుమానంతో అదుపులోకి తీసుకుని విచారించారు. జల్సాలకు అలవాటుపడిన నిందితులు చోరీకి పాల్పడింది తామేనని అంగీకరించారు. వారి వద్ద నుంచి రూ.4వేల నగదును స్వాధీనపర్చుకుని నిందితులను రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ రమాకాంత్ వివరించారు.

అనుమానాస్పదంగా యువకుడి మృతి

వేములవాడ టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ కల్లు కంపౌండు వద్ద గురువారం ఒంటినిండా గాట్లతో అనుమానాస్పదంగా ఓ యువకుడి మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని రాంగనర్‌కు చెందిన సారుగు రఘు(32) అనే యువకుడు వంట మాస్టర్‌గా పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి భార్య అమూల్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. సంవత్సరం క్రితం రఘుకు భార్యతో గొడవలు కావడంతో ఆమె తల్లిగారి ఊరు సిద్దిపేట మండలం జక్కాపూర్ గ్రామంలో ఉంటోంది. గురువారం ఉదయం 11గంటల వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్ కల్లు కాంపౌండువద్ద ఒంటిమీద గాట్లతో రఘు మృతదేహం అనుమానాస్పదంగా కనబడటంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతికిగల కారణాలను ఆరాతీశారు. విషయం తెలుసుకున్న అమూల్య కుటుంబ సభ్యులతో కలిసి వేములవాడ ఏరియా ఆసుపత్రికి వచ్చి మృతుడిని గుర్తించింది. తన భర్త మృతిపై అనుమానాలు ఉన్నాయని అమూల్య ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ వీర్రప్రసాద్ తెలిపారు.

అక్రమ కట్టడం కూల్చివేత

రామడుగు,జనవరి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామంలోని పల్లెప్రకృతి వనంలో అక్రమంగా నిర్మించిన కట్టడాన్ని గ్రామ కార్యదర్శి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జీపీ సిబ్బంది కూల్చి వేశారు. రాత్రికి రాత్రే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి నిర్మాణం చేపట్టగా గ్రామస్థుల ఫిర్యాదు మేరకు స్పందించిన కార్యదర్శి పోలీసుల బందోబస్తు మధ్య అక్రమ కట్టడాన్ని కూల్చివేశారు. ప్రభుత్వం స్థలం ఆక్రమించి నిర్మాణం చేపట్టిన వ్యక్తిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తున్న షాపు యజమానులకు జరిమానా

ధర్మపురి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలో గురువారం మున్సి పల్ కమిషనర్ కందుకూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది పలు షాపులను తనిఖీ చేసి ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తున్న యజమానులకు జరిమానా విధించారు. తనిఖీల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిట్యాల గంగాధర్, ఎన్విరాన్‌మెంట్ ఇంజ నీరు మహేష్, వార్డు ఆఫీసర్ వెంకటేష్ పాల్గొన్నారు.

విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరికి జైలు

వేములవాడ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పోలీసు విధులకు ఆటంకం కలిగించిన కేసులో ఇద్దరు వ్యక్తులకు ఆరు మాసాల కారాగార జైలు శిక్ష, వెయ్యి రూపాయల చొప్పున జరిమానా విధిస్తూ వేములవాడ జూనియర్ సివిల్ జడ్జి జ్యోతిర్మయి గురువారం తీర్పు వెల్లడించినట్లు వేములవాడ పట్టణ సీఐ వీర్రప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. వేములవాడ పట్టణానికి చెందిన రొండే శంకరయ్య, గుర్రం అశోక్ తనవిధులకు ఆటంకం కలిగించినట్లు ఎస్సై చిట్టిబాబు అక్టోబరు 2017లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ అనంతరం విచారణ అధికారి శ్రీనివాస్ కోర్టులో చార్జిషీటు దాఖలు చేయగా, కోర్టు కానిస్టేబుల్ సురేష్‌కోర్టులో సాక్ష్యం ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. ప్రాసిక్యూషన్ తరపున విక్రాంత్ కేసును వాదించగా, పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి ఇద్దరికి ఆరు మాసాల జైలుశిక్షతోపాటు ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల జరిమానా కూడా విధించినట్లు సీఐ ప్రకటనలో పేర్కొన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

పెద్దపల్లి రూరల్, జనవరి30(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాసులపల్లి గ్రామానికిచెందిన కడారిఐలయ్య(68) అనేవృద్ధుడు జీవితంపై విరక్తిచెంది బావిలో దూకి గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, కుటుంబసభ్యుల వివరాల ప్రకారం మృతుడు ఐలయ్య క్యాన్సర్‌వ్యాధితో బాధపడుతున్నాడు. ఎన్ని ఆసుపత్రులు తిరిగినా నయం కాకపోవడంతో జీవతంపై విరక్తిచెంది బావిలోపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడిభార్య రాయమల్లమ్మ ఫిర్యాదు మేరకు ఎస్ఐ లక్ష్మణ్‌రావు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సాంప్రదాయ సాగును వదిలి..

- వ్యవసాయంలో నూతన ఒరవడి..
- అధిక ఆదాయం పొందుతున్న మంగళపల్లి, మల్కపేట రైతులు



మల్కపేటలో సాగు చేస్తున్న మొక్కజొన్న

కోనరావుపేట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఒక్కప్పుడు వ్యవసాయం అంటే వరి సాగు అనే పరిస్థితి ఉండేది. పరిస్థితులకు అనుగుణంగా రైతులు తమ పద్ధతులు మార్చుకుంటున్నారు. వరిని వదిలిపెట్టి కూరగాయలు, పూలు, మొక్కజొన్న.. ఇలా వేర్వేరు రకాల పంటలను సాగు చేస్తున్నారు. మండలానికి చెందిన పలువురు రైతులు పంటల మార్పిడి చేస్తూ అధిక ఆదాయం పొందుతున్నారు.

కోనరావుపేట మండలం మంగళపల్లిలో ఉప్పుల మల్లయ్య, రొక్కం కావ్య-శ్రీకాంత్‌రెడ్డి దంపతులు వ్యవసాయంలో కూరగా యలు, మొక్కజొన్న, వరి, పత్తి సాగు చేస్తూ అధిక దిగుబడి సాధిస్తున్నారు. మల్కపేటకు చెందిన తీపిరి ప్రభాకర్‌తో పాటు ఇతర గ్రామాల రైతులు పంటల మార్పిడిపై దృష్టి సారించారు. తమకు ఉన్న కొద్దిపాటి భూముల్లో పలు రకాల పంటలు పండిస్తూ ఎక్కువ దిగుబడులు సాధిస్తున్నారు. సీజన్‌కు అనుకూలంగా కూరగాయలు, మొక్క జొన్న సాగు చేస్తున్నారు. పచ్చి కంకులను అమ్మడం వల్ల ఎకరాకు 80 వేల రూపాయల ఆదాయం పొందారు. ఎండిన కంకులు విక్రయిస్తే తక్కువ ఆదాయం వచ్చేదని రైతులు చెబుతున్నారు. దీనివల్ల రైతులకు ఆదాయం పెరిగిందని, పంటల మార్పిడి చేయడం వల్ల భూసారం పెరిగి, పెట్టుబడులు తగ్గి అధిక దిగుబడులు వస్తున్నాయని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



మంగళపల్లిలో చిక్కుడుకాయను సేకరిస్తున్న కూలీలు

మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు

- రొక్కం కావ్యశ్రీకాంత్‌రెడ్డి, మహిళా రైతు



నేను పీజీ చేశాను. ఉద్యోగాలకు వెళ్లకుండా వ్యవసాయంపైనే దృష్టి సారించాను. వ్యవసాయంలో పాత పద్ధతిలో కాకుండా మెలకువలు పాటిస్తూ కూరగాయలు, మొక్కజొన్న, పత్తి, మిర్చి పండిస్తూ అధిక దిగుబడి సాధిస్తున్నాం. ఉద్యోగాలకు వెళ్లకుండా నా భర్త శ్రీకాంత్‌రెడ్డితో కలిసి వ్యవసాయం చేస్తూ మంచి లాభాలు సాధిస్తున్నాం.

నూతన పద్ధతులు పాటించాలి..

- సందీప్, వ్యవసాయ అధికారి, కోనరావుపేట



వ్యవసాయంలో రైతులు నూతన పద్ధతులు పాటించాలి. పంటల మార్పిడి ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చు. మండల రైతులు మెలుకులు పాటించే విధంగా అవగాహన కల్పిస్తున్నాం. ఇప్పటికే పలు గ్రామాల రైతులు అధికారుల సూచనలు పాటిస్తూ దిగుబడి సాధిస్తున్నారు. ఇంకా రైతుల్లో మార్పు రావడానికి ప్రయత్నం చేస్తాం.

బూట్లతో ఆలయంలోకి వెళ్లేందుకు యత్నించిన వ్యక్తి

- మతిస్థిమితం సరిగా లేదని గుర్తింపు..

వేములవాడ టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌కు చెందిన ఓవ్యక్తి వేములవాడ మండలం అగ్రహారం హనుమాన్ ఆలయంలోకి బూట్లు ధరించి వెళ్లేందుకు యత్నించాడు. దీంతో గమనించిన ఆలయ అర్చకులు, సిబ్బంది ఆయను అడ్డుకునేందుకు యత్నించారు. దీంతో సదరు వ్యక్తి అర్చకులతో వాగ్వాదానికి దిగాడు. ఆలయ సిబ్బంది వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకుని సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు విచారణ చేసిన పోలీసులు కరీంనగర్‌కు చెందిన ఖాజా మొయినుద్దీన్‌గా గుర్తించారు. ఈ మేరకు సదరు వ్యక్తి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా, మతిస్థిమితం లేని వ్యక్తిగా గుర్తించి హైదరాబాద్‌లోని ఎర్రగడ్డ మానసిక వైద్య ఆసుపత్రికి పంపించినట్లు టౌన్ సీఐ వీర్రప్రసాద్ తెలిపారు.

తగిన పరిహారం ఇస్తేనే భూములు ఇస్తాం

- ఎకరానికి రూ.45నుంచి 50లక్షలు ఇవ్వాలని రైతుల డిమాండ్



భూసేకరణ డిప్యూటీ కలెక్టరుకు వినతిపత్రం అందజేస్తున్న నవాబుపేట రైతులు

చిగురుమామిడి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): వరదకాలువ నిర్మాణంలో భూములు కోల్పోతున్న తమకు ఎకరానికి రూ.45నుంచి 50 లక్షలవరకు పరిహారం ఇవ్వాలని నవాబుపేట రైతులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గురువారం నిర్వహించిన గ్రామసభలో ఈ విషయాన్ని పేర్కొంటూసభ నుంచి వెళ్లిపోయారు. మండలంలోని నవాబుపేట గ్రామంలో వరదకాలువ నిర్మాణానికి భూసేకరణ కోసం గ్రామంలోని రైతువేదికలో అధికారులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామంలో 67మంది రైతులకు సంబంధించిన 42ఎకరాలపై చిలుకు భూములు కాలువ నిర్మాణంలో పోతు న్నట్లు అధికారులు సర్వేలో తేల్చారు. సంబంధిత రైతులకు సమాచారం ఇవ్వడానికి గ్రామంలో భూసేకరణ డిప్యూటీ కలెక్టరు కిరణ్‌ప్రకాశ్ అధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సమావేశానికి రైతులు పెద్దఎత్తున వచ్చారు. అధికారులు భూములు కోల్పోతున్న రైతుల జాబితాను చదివి వినిపించడానికి ప్రయత్నం చేయగా రైతులు అభ్యంతరం తెలిపారు. మాకు ఎలాంటి సమావేశాలు వద్దని, ఎకరానికి రూ.45నుంచి 50లక్షల వరకు పరిహారం అందిస్తేనే భూములు ఇస్తామని డిమాండ్ చేశారు. మాకు న్యాయం జరిగితేనే భూములు ఇస్తాం, లేదంటే ఇచ్చేది లేదని అధికారులకు తేల్చి చెప్పి సమావేశం బహిష్కరించి వెళ్లిపోయారు.

అండర్‌గ్రౌండ్ కేబుల్ పనులు అభినందనీయం

- టీజీ ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి



అండర్ గ్రౌండ్ కేబుల్ కాంప్యాక్ట్‌ట్రాన్స్‌ఫార్మర్ పనులను పరిశీలిస్తున్న సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి

గణేశ్‌నగర్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): తెలంగాణలోనే మొట్టమొదటగా అండర్‌గ్రౌండ్ కేబుల్ పనులు అభినందనీయమని టీజీ ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి అన్నారు. స్మార్ట్‌సిటీ వర్క్స్‌లో భాగంగా టవర్ సర్కిల్ గంజ్ ఏరియాలో చేపట్టిన పనులను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందిని అభినందించారు. డిస్కమ్‌లో కరీంనగర్ జిల్లా, కరీంనగర్ టౌన్ డివిజన్, టౌన్ -1 సబ్ డివిజన్, టౌన్ -5 సెక్షన్స్ అవార్డులు తీసుకున్నందుకు మేక రమేష్, డీఈ జంపాల రాజం, ఏడీఈ పంజాల శ్రీనివాస్ గౌడ్, ఏఈ-టౌన్-5, నజియజాబిన్‌లను అభినందించారు.

చిన్నారి ధృవన్ సురక్షితం?

- మమత మిస్టరీ కేసులో పోలీసుల పురోగతి

కరీంనగర్ క్రైం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మంచిర్యాలలో అదృశ్యమైన తల్లీకొడుకుల కేసులో తల్లి అనుమానాస్పదంగా మృతి చెందగా కొడుకు సురక్షితంగా ఉన్నట్లు సమాచారం. వారం రోజులక్రితం మంచిర్యాలలో అదృశ్యమైన తల్లీకొడుకులలో తల్లి మమత గంగాధర మండలం కురిక్యాల వరద కాలువ సమీపంలో మృతదేహం లభ్యమైంది. ఆమె నాలుగేళ్ల కొడుకు ధృవన్ ఆచూకీ తెలియకపోవటంతో గంగాధర, చొప్పదండి పోలీసులు నాలుగు రోజులుగా సీసీ కెమెరాలు, ఫోన్‌కాల్స్ జల్లెడ పడుతుండగా కేసుకు సంబంధించిన కీలకమైన సమాచారం సేకరించినట్లు తెలుస్తోంది. చిన్నారి ధృవన్ సేఫ్‌గా ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. నిందితులను ఇంకా పోలీసులు అదుపులోకి తీసుకోలేదని తెలిసింది. నిందితుల ఉపయోగించిన కారు యజమానిని గుర్తిం చినప్పటికీ ఆ కారును కొందరికి కిరాయికి ఇచ్చినట్లుగా యజమాని చెబుతున్నట్లు సమాచారం. కేసులో నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక పోలీసు టీంలు నిర్విరామంగా పనిచేస్తున్నాయి. ఇప్పటికే కొన్ని పోలీసు టీంలు హైదరాబాద్, ఆదిలాబాద్ జిల్లాలకు వెళ్లి కొంత సమాచారం సేకరించినట్లు తెలిసింది. మమత హత్య కేసుకు సంబంధించి నిందితులను శుక్రవారం వరకు అరెస్టు చేసే అవకాశముందని తెలుస్తోంది. మమతను తెలిసిన వారే వెంట తీసుకువెళ్లి ఘటనకు పాల్పడినట్లుగా సమాచారం.

రోడ్డు పనుల అడ్డగింత

ఎల్లారెడ్డిపేట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం దుమాల గ్రామపంచాయతీ పరిధిలోని రామిండ్ల వాడ నుంచి అక్కపల్లి వరకు నిర్మిస్తున్న రహదారి పనుల్లో భాగంగా తమ వ్యవసాయ భూమిలో నుంచి పనులు చేస్తున్నారని పేర్కొంటూ బాధితులు గురువారం అడ్డుకున్నారు. జేసీబీ వాహనాన్ని నిలిపివేసి నిరసనకు దిగారు. గ్రామ శివారులో చేపడుతున్న రహదారికి రెండు వైపులా స్థలాన్ని కేటాయించకుండా తమ భూమిలో నుంచే నిర్మాణ పనులు చేస్తున్నారని బాధితులు రామిండ్ల దేవలక్ష్మీ పేర్కొన్నారు. ముందుగా ఇరు పక్కల ఉన్న రైతుల భూముల్లో నుంచి కొలతలు వేసిన సంబంధిత శాఖ అధికారులు తిరిగి తమ భూమిలో నుంచి పనులు చేపట్టి తమకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. తమకు న్యాయం జరిగే వరకు పనులను ముందుకు సాగనీయబోమని తేల్చిచెప్పారు. ఈ విషయంపై తహసీల్దార్ రామచంద్రంను వివరణ కోరగా రహదారి నిర్మాణంలో ఎవరికీ అన్యాయం జరుగకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యను పరిష్కరించేందుకు పాటు పడుతామని తహసీల్దార్ రామచంద్రం వివరించారు.

పోలీస్ బెటాలియన్ సందర్శన

సిరిసిల్ల రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్లఅర్బన్ పరిధిలోని సర్దాపూర్17వ బెటాలియన్‌ను పోలీస్ హౌసింగ్‌కార్పొరేషన్ ఎండీ రమేష్ (ఐజీపీ) గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా నిర్మాణంలో ఉన్న పనులను పరిశీలించారు. వెంట ఎస్పీ అఖిల్‌మహాజన్, బెటాలియన్ ఇన్‌చార్జి అసిస్టెంట్ కమాండెంట్ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువ కానిస్టేబుల్ దుర్మరణం

- గర్జనపల్లిలో విషాదం



మృతదేహానికి నివాళులర్పిస్తున్న అసిస్టెంట్ కమాండెంట్ సత్యనారాయణ

వీర్నపల్లి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలానికి చెందిన యువకానిస్టేబుల్ మృతిచెందాడు. ఈ ఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకివెళితే.. రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం సీతారాం నాయక్ తండా గ్రామానికి చెందిన అజ్మీర కళ్యాణ్ (30) నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి 7వ బెటాలియన్‌లో 2018 బ్యాచ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. బుధవారం రాత్రి విధులు ముగించుకొని ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా వెనుక నుంచి లారీ ఢీకొనడంతో తీవ్ర గాయాలతో కళ్యాణ్ అక్కడికక్కడే మృతిచెందాడు. యువకానిస్టేబుల్ మృతితో స్వగ్రామంసీతారాం నాయక్ తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి. గురువారం మృతదేహం స్వగ్రామం చేరడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు, పోలీసులు పెద్దఎత్తున తరలి వచ్చారు. అదే గ్రామానికి చెందిన సీఐడీ ఎస్పీ భుక్య రాంరెడ్డితోపాటు 7వబెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్లు సత్యనారాయణ, శరత్, ఆర్ఐ నరేష్, ఆర్ఎస్ఐలు తిరుపతి, వేణు, సుమారు వంద మంది 2018 బ్యాచ్ కానిస్టేబుళ్లు పాల్గొని మృతుడికి నివాళులర్పించారు. మృతునికి భార్య సుష్మ, కుమార్తె అభియుక్త(3), కుమారుడు అభిషేక్ (4 నెలలు) ఉన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ

జమ్మికుంట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం నాగంపేట గ్రామపంచాయతీ కార్యదర్శి ఇల్లందుల శ్రీనివాస్ నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డాడని అదే గ్రామానికి చెందిన కట్కోజుల శ్రీనివాస్ ఆచారి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. గురువారం నాగంపేట గ్రామపంచాయతీ కార్యాలయంలో జిల్లా గ్రామపంచాయతీ అధికారి పాత శ్రీనివాస్, ఇంచార్జ్ ఎంపీడీవో వెంకటేశ్వర్లు నిధుల దుర్వినీయోగంపై విచారణ చేపట్టారు. అప్పటి రికార్డులు, ఇతర రశీదులు క్షుణ్ణంగా పరిశీలించారు. నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు అందజేస్తామని జిల్లా పంచాయతీశాఖ అధికారి తెలిపారు. ఆనంతరం ఫిర్యాదు దారుడు శ్రీనివాస్ ఆచారి మాట్లాడుతూ నిధుల దుర్వినియోగానికి సంబంధించిన వివరాలు ఇవ్వాలని ఆర్టీఐ ద్వారా కోరినప్పటికీ సదరు కార్యదర్శి జాప్యం చేశాడన్నారు. నిధుల దుర్వినియోగానికి పాల్పడిన కార్యదర్శి ఇల్లందుల శ్రీనివాస్ ప్రస్తుతం ఇల్లందకుంట కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి

ధర్మపురి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యాయత్నం చేసిన ధర్మపురి మండలం రాజారం గ్రామానికి చెందిన సునార్‌కాని సందీప్ అనే తొమ్మిదో తరగతి విద్యార్థి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఎస్ఐ ఉదయ్‌కుమార్ తెలిపారు. బాగా చదువుకోవాలని, స్నేహితులతో తిరగవద్దని తండ్రి మందలించ డంతో ఈనెల18న సందీప్ ఇంటిలో గడ్డి మందు తాగినట్లు ఎస్ఐ తెలిపారు. సందీ ప్‌ను మెరుగైన వైద్యచికిత్సకోసం కరీంనగ ర్‌లోని ఒకప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పిం చారు. చికిత్స పొందుతూ సందీప్ గురు వారం మృతిచెందాడు. తండ్రి సునార్‌కాని మల్లేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ..

కరీంనగర్ క్రైం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నం చేసిన కరీంనగర్‌రూరల్ మండలం గోపాల్‌పూర్ గ్రామానికి చెందిన మేకల కవిత(24) గురువారం మృతి చెందిందని కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు. ఈ నెల 28న పురుగుల మందు తాగిన మేకలకవితను కుటుంబ సభ్యులు కరీంనగర్‌లో ప్రాథమిక చికిత్స అనంతరం హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

తాటి చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

చొప్పదండి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్లాపూర్ గ్రామానికి చెందిన గీత కార్మికుడు ప్రమాదవ శాత్తు తాటిచెట్టు పైనుంచి కిందపడి గాయపడ్డాడు. గుమ్లాపూర్ గ్రామానికి చెందిన పెరుమాండ్ల శ్రీనివాస్(40) గీత కార్మిక వృత్తి చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గురువారం కల్లుతీసేందుకు తాటిచెట్టు ఎక్కిన శ్రీనివాస్ అకస్మాత్తుగా పైనుంచి జారికిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడ్డ శ్రీనివాస్‌ను కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడి మృతి

మల్లాపూర్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): అప్పులబాధతో బుధవారం పురుగుల మందుతాగిన మండలంలోని సిర్పూర్ గ్రామానికి చెందిన మహ్మద్ ఖలీల్(36) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై రాజుకుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలప్రకారం మహ్మద్ ఖలీల్ పాషా నాలుగేండ్లుగా గల్ఫ్ దేశాలకు వెళ్లి వస్తున్నాడు. అక్కడ సరియైన పనిలేక స్వగ్రామం వచ్చితిరిగి మళ్లీఅప్పుచేసి దుబాయ్ వెళ్లాడు. అయిన పనిసరిగా లేదని ఇంటికి వచ్చాడు. చేసిన అప్పులు ఎలాతీ ర్చాలని మనస్థాపానికి గురై బుధవారం సిర్పూర్ గ్రామశివారులోని ఎల్లమ్మగుడి దగ్గర మందుతాగి కుటుంబసభ్యులకు ఫోన్‌ద్వారా తెలిపాడు. కుటుంబసభ్యులు ఖలీల్‌ను ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. భార్య రేష్మ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బీఈడీ రెండో సెమిస్టర్ పరీక్షల ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో గత నవంబర్‌లో నిర్వహించిన బీఈడీ రెండవ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను గురువారం శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్ వి శ్రీరంగ ప్రసాద్ విడుదల చేశారు. విద్యార్థులు పరీక్షల ఫలితాలను శాతవాహన వెబ్‌సైట్ www.satavahana.ac.in చూసుకోవచ్చని తెలిపారు.

వెలిచాల గ్రామాన్ని సందర్శించిన యూనిసెఫ్ బృందం

రామడుగు,జనవరి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలిచాల గ్రామాన్ని గురువారం యూనిసెఫ్ బృందం సందర్శించింది.ఈ సందర్భంగా గ్రామంలోని మిషన్ భగీరథ తాగునీటి సరఫరాను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన విటమిన్ గార్డెన్‌ను, పాఠశాల విద్యార్థులు అవలంబిస్తున్న హ్యాండ్‌వాష్ పద్ధతిని గమనించారు. వారి వెంట అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయి, యూనిసెఫ్ ప్రతినిధులు వెంకటేష్, ప్రభాత్, ఫణీంద్ర, డీఆర్డీవో శ్రీధర్, డిడబ్ల్యూవో సబిత, తదితరులు ఉన్నారు.

మహాశివరాత్రి జాతరకు ఏర్పాట్లు



గుడిచెరువులోని పార్కింగ్ స్థలాన్ని శుభ్రం చేస్తున్న సిబ్బంది

వేములవాడ కల్చరల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి జాతరకు రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఏర్పాట్లను వేగవంతం చేస్తున్నారు. మహాశివరాత్రి జాతరను పురస్కరించుకుని లక్షల్లో భక్తులు రానున్న నేపథ్యంలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గురువారం ఉదయం ఆలయ పార్కింగ్ స్థలాన్ని చదును చేయించారు. ప్రతిసంవత్సరం మూడు రోజులపాటు నిర్వహించే జాతరకు పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నామని, నిత్యం ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నామని, ఇప్పటికే ఆలయగోపురాలు, గోడలకు పెయింటింగ్, సీసీ కెమరాలు, స్మార్ట్ టీవీలు, గ్రాగునీరు. లైటింగ్ సిస్టం, క్యూలైన్‌లో భక్తుల సౌకర్యార్థం ఫ్యాన్‌లను ఏర్పాటు చేసినట్లు ఈవో తెలిపారు.

అంజన్న హుండీ ఆదాయం రూ1.15కోట్లు



హుండీ డబ్బులు లెక్కిస్తున్న సిబ్బంది

మల్యాల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థానానికి హుండీలద్వారా రూ.1,15,93,291నగదు ఆదాయం సమకూరినట్లు ఈవో కృష్ణప్రసాద్ తెలిపారు. 70రోజులకు ఆలయంలోని 12హుండీలను విప్పి గురువారం లెక్కింపు చేయగా నగదుతో పాటు 55గ్రాముల మిశ్రమబంగారం, 3కిలోల మిశ్రమ వెండి, 61విదేశీ కరెన్సీ లభించినట్లు ఈవోతెలిపారు. లెక్కింపులో కరీంనగర్ ఏసీ సుప్రియ, ఏఈవో వైఅంజయ్య, పర్యవేక్షకులు సునీల్, చంద్రశేఖర్, హరిహరనాథ్ పాల్గొన్నారు.

ఎన్టీపీసీ ఉద్యోగుల డిమాండ్లను అంగీకరించాలి

● ఢిల్లీలో ఎన్‌బీసీ సమావేశంలో గుర్తింపు సంఘం డిమాండ్



సమావేశంలో పాల్గొన్న గుర్తింపు సంఘాల నాయకులు

జ్యోతినగర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ ఉద్యోగుల డిమాండ్లను సత్వరమే యాజమాన్యం అంగీకరిచాలని ఎన్‌బీసీ సభ్యుడు, గుర్తింపు కార్మికసంఘం ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ బాబర్ సలీం పాషా, నాయకులు డిమాండ్ చేశారు. ఢిల్లీలో గురువారం నిర్వహించిన జాతీయ ద్వైపాక్షిక సంఘం(ఎన్‌బీసీ) సమావేశంలో ఐఎన్‌టీయూసీ తరుపున 22డిమాండ్లను లేవనెత్తారు. ఎన్టీపీసీని స్థాపించి50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఎన్టీపీసీ ఉద్యోగులకు ఐదు లక్షల రూపాయల నగదు లేదా 50గ్రాముల బంగారాన్ని బహుమతిగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. డబ్ల్యు 10కేటగిరి ఉదోగులకు ఇ2(ఎగ్జిక్యూటివ్) పదోన్నతి కల్పించాలన్నారు. పదోన్నతిపొందిన ఉద్యోగులకు వారు పనిచేస్తున్న రీజియన్‌పరిధిలోని ప్రాంతాలకే పరిమితం చేయాలని డిమాండ్ చేశారు. బీటెక్‌పూర్తిచేసిన ఉదోగులకు సమానస్థాయి పోస్టులను కల్పించాలని, డిప్లొమాట్రైనీలకు శిక్షణాకాలాన్ని ఏడాదికేపరిమితం చేయాలన్నారు. అధికారులకు ఇస్తున్న విధంగానే మూడేళ్లకు ఒకసారి ల్యాప్‌టాప్ రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని చెల్లించాలని కోరారు. ఎన్‌బీసీ సమావేశంలో రామగుండం ఎన్టీపీసీ గుర్తింపు సంఘం ప్రధాన కార్యదర్శి ఆరెపల్లి రాజేశ్వర్, అధ్యక్షుడు కృష్ణయ్య, ఇతర ప్రాజెక్టుల గుర్తింపు సంఘం నాయకులు, ఎన్టీపీసీ హెచ్‌ఆర్ అధికారులు పాల్గొన్నారు.

షెడ్యూల్ విడుదలతో రాజకీయ వేడి

● అభ్యర్థుల ఖరారుపై పార్టీల దృష్టి

● ఒకటి, రెండు రోజుల్లో ప్రకటించనున్న ఏఐసీసీ

● పార్టీ నేతల మొగ్గు అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి వైపే..

● బీఆర్ఎస్ అభ్యర్థిగా సర్దార్ రవీందర్‌సింగ్?

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు షెడ్యూల్ విడుదల కావడంతో రాజకీయ సందడి మొదలైంది. అభ్యర్థుల ఖరారుపై పార్టీ దృష్టి పెట్టాయి. ఈ మేరకు కసరత్తులు ప్రారంభించాయి. గురువారం మీడియాతో మాట్లాడిన రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీదర్‌బాబు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి పోటీ చేయరని, అభ్యర్థి ఎవరన్నది ఒకటి రెండు రోజుల్లో ప్రకటిస్తామని వెల్లడించారు. అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి నరేందర్‌రెడ్డి వైపు పార్టీ నేతలు మొగ్గు చూపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. నేడో, రేపో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి అధికారికంగా అభ్యర్థిని ప్రకటించే అవకాశ మున్నదని సమాచారం. టీపీసీసీ నుంచి ఈ స్థానానికి సిట్టింగ్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పేరునే పంపించారు. జీవన్‌రెడ్డి



తాను పోటీలో ఉండబోనని ఏఐసీసీకి తెలిపారు. నరేందర్‌రెడ్డి మొదట జీవన్‌రెడ్డి వద్దకు వెళ్లి ఆయన పోటీ చేసే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి పోటీకి పెద్దగా ఆసక్తి చూపించలేదని ప్రచారం జరిగింది.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల గురించి టీపీసీసీలో సమావేశం జరిగిన సందర్భంలో తన రాజకీయ భవిష్యత్ గురించి జీవన్‌రెడ్డి ప్రశ్నించడంతో ఆయన తిరిగి పోటీలో ఉంటారేమోనని భావించారు. గురువారం శ్రీధర్‌బాబు ప్రకటనతో ఆయన పోటీ చేయరని స్పష్టత వచ్చింది. కాగ్రెస్ అధిష్ఠానం ఇప్పటికే అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి, ప్రసన్న హరికృష్ణ పేర్లను పరిశీలించి క్షేత్ర స్థాయిలో సమాచారాన్ని సేకరించారు. ఈ నియోజకవర్గ పరిధిలోకి వచ్చే 42 అసెంబ్లీ స్థానాల్లో పార్టీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, పార్టీ ఎంపీల అభిప్రాయాలు తెలుసుకొని నరేందర్‌రెడ్డి పేరును ఖరారు చేయాలనికి నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజక వర్గంలో ఇప్పటి వరకు 3.47 లక్షల ఓట్లు నమోదు కాగా అందులో సగం మ్మడి జిల్లాకు చెందినవే ఉన్నాయి. దీంతో ఈ జిల్లా వాసినే అభ్యర్థిగా నిలిపితే గెలుపు సాధించవచ్చని పార్టీ భావిస్తున్నట్లు సమాచారం. నరేందర్‌రెడ్డి అందరి కంటే ఎక్కువ ఓట్లు నమోదు చేయించుకున్నారు. ఈ అంశం ఆయనకు కలిసి వచ్చే అవకాశం ఉంది.

బీఆర్ఎస్ అభ్యర్థిగా సర్దార్ రవీందర్‌సింగ్?

కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థిగా మాజీ మేయర్, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్‌ను నిలపాలని ఆ పార్టీ అధినేత కేసీఆర్ భావిస్తున్నట్లు సమాచారం. కాంగ్రెస్ అభ్యర్థి పేరు వెల్లడి కాగానే తమ అభ్యర్థిని ప్రకటించాలని బీఆర్ఎస్ నాయకత్వం భావిస్తోందని తెలిసింది. రవీందర్‌సింగ్ అభ్యర్థిత్వంపై కేటీఆర్, హరీష్‌రావు, కవిత సుముఖంగా ఉన్నారని సమాచారం. అభ్యర్థిని నిలిపితే ఉద్యమకారుడు అయిన రవీందర్‌సింగ్‌కే అవకాశం కల్పించాలని కేసీఆర్‌కు సూచించినట్లు సమాచారం. కరీంనగర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ ఇదే తన అభిప్రాయంగా కేటీఆర్ దృష్టికి తీసుకువెళ్లారని తెలిసింది. ఈ రోజు లేదా రేపటికి రవీందర్‌సింగ్ పేరును పార్టీ ప్రకటించే అవకాశ ముందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.



బీసీ రిజర్వేషన్‌పై తీర్పురాగానే స్థానిక ఎన్నికలకు వెళతాం

● మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ అర్బన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రాబోయే రోజుల్లో కోర్టులో ఉన్న స్థానిక సంస్థల బీసీ రిజర్వేషన్‌పై తీర్పు రాగానే ఎన్నికలకు వెళుతామని రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆయన కొండా సత్యలక్ష్మి గార్డెన్స్‌లో కార్యక్రమం ముగిసిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ల తీర్పు వచ్చా ఎన్నికలకు వెళ్లి తప్పక విజయం సాధిస్తామన్నారు. బీసీల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

కామారెడ్డి డిక్లరేషన్‌కు కట్టుబడి ఉన్నామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో బీసీల రిజర్వేషన్ ప్రక్రియ గురించిన అంశం కోర్టు పరిధిలో ఉందని, సానుకూలమైన తీర్పు వస్తుంద న్నారు. తీర్పును అనుసరించి విధివిధా నాలు ఉంటాయన్నారు. వాటి ప్రకారం ప్రభుత్వం స్థానికసంస్థల్లో రిజర్వేషన్ కల్పిస్తుంద న్నారు. ఎన్నికలకు భయపడే ప్రభుత్వం మాది కాదు... ప్రజల మద్దతు ఉన్న ప్రజాప్రభుత్వం మాది అని పేర్కొన్నారు. ప్రతిపక్షాలకు విలువ ఇవ్వని గత ప్రభుత్వాలకు మాట్లాడే అర్హత లేదన్నారు.

నిజాం షుగర్ ఫాక్టరీని పునరుద్ధరిస్తాం

● ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

కరీంనగర్ అర్బన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): నిజాం షుగర్ ఫ్యాక్టరీని 2025డిసెంబర్‌లోగా పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. గురువారం కరీంనగర్‌లో విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఎన్నికల హామీల అమలులో భాగంగా నిజాం షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణ పనులు త్వరలో ప్రారంభమవుతాయని తెలిపారు. ఫ్యాక్టరీకి సంబందించి 100కోట్ల అప్పు కూడా చెల్లించామని తెలిపారు. స్థానిక రైతులను చెరుకు పంటకు సిద్ధం చేయాల్సిన అవసరముందని, ఈదిశగా త్వరలోనే చర్యలు తీసుకుంటామన్నారు. నిజాం చెరుకు ఫాక్టరీ పునరుద్ధరణకు అవసరమైతే కేంద్రసహాయం కూడా కోరుతామన్నారు. కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థిని కాంగ్రెస్‌పార్టీ రెండు రోజుల్లో ప్రకటిస్తుందని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ వంద శాతం కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. జీవన్‌రెడ్డి ఎమ్మెల్సీగా పోటీ చేయనని ఏఐసీసీకి చెప్పారన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థుల కోసం నాలుగు జిల్లాల నుంచి చాలామంది ఆశావహుల నుంచి దరఖాస్తులు వచ్చాయని, వీటిని ఏఐసీసీ పరిశీలించి అర్హులను ప్రకటిస్తుందన్నారు. రాబోయే 3సంవత్సరాల్లో అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు ఇస్తామన్నారు. హైదరాబాద్ నగరానికి దీటుగా ద్వితీయ, తృతీయశ్రేణి నగరాలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు.

దావోస్‌లో పారిశ్రామికవేత్తలకు హైదరాబాద్ ప్రత్యేకత గురించి వివరించామన్నారు. చిన్న, మధ్య, సూక్ష్మ తరహా పరిశ్రమలను ఏర్పాటు చేయాలని రాష్ట్రంలో ఏడాది కిందట ఎంఎస్‌ఎంఇ(మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్) పాలసీని తీసుకువచ్చామన్నారు. దేశంలోనే తెలంగాణ ఎంఎస్‌ఎంఇ మెరుగైన పాలసీగా పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గంలో పారిశ్రామిక పార్కులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మహిళలకు రుణాలు అందించి. వారితో



మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

పరిశ్రమలను ఏర్పాటు చేయించి.. ఉత్పత్తి, మార్కెటింగ్‌ల ద్వారా మహిళలు, మహిళా సంఘాలను పటిష్టం చేసే చర్యలు తీసుకున్నామన్నారు. దావోస్ ఒప్పందంలో సాఫ్ట్‌వేర్ రంగాలలో పెద్ద ఎత్తున పెట్టుబడులు వచ్చాయని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. అమెరికా కూడా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో పెద్ద ఎత్తున 500బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టిందని ప్రెసిడెంట్ ట్రంప్ ప్రకటించారన్నారు. పారిశ్రామికవేత్తల నుంచి పెట్టుబడులు తీసుకువచ్చి రాష్ట్రంలోని నిరుద్యోగు యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా దావోస్ ఒప్పందాలు చేసుకున్నట్లు మంత్రి వెల్లడించారు. గత సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం దావోస్‌లో 18 పారిశ్రామిక పెట్టుబడుల ఒప్పందాలు చేసుకోగా ఇందులో 10ఒప్పందాలతో 50శాతం వరకు పనులు పూర్తయ్యాయని, మరో ఎనిమిది ప్రగతిలో ఉన్నట్లు మంత్రి తెలిపారు. పారిశ్రామిక, ఐటీరంగాలలో తెలంగాణ మొదటిస్థానంలో ఉండాలనే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. పద్మ అవార్డుల ఎంపిక కోసం తెలంగాణ అనేకమంది, వివిధ రంగాలలో నిష్ణాతులు ఉన్నారని.. కేంద్రప్రభుత్వం గుర్తించాలని మంత్రి కోరారు. సమావేశంలో మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, మాజీఎమ్మెల్యే ఆరెపల్లిమోహన్, కరీంనగర్ అసెంబ్లీ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్, మహిళా కాంగ్రెస్‌జిల్లా అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న రెడ్డి, ఒగ్గుదామోదర్, కొరివి అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

హోరాహోరీగా రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడలు

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 30 (ఆంధ్ర జ్యోతి): రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడలు హోరాహోరీగా సాగుతున్నాయి. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదా నంలో నిర్వహిస్తున్న ఈ క్రీడలను మూ డోరోజు గురువారం ఐజీ స్పోర్ట్స్ రమేష్ రెడ్డి, కరీంనగర్ సీపీ అభిషేక్ మొహంతి ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ. క్రీడలతో క్రమశిక్షణ, క్రీడా స్పూర్తి అలవడుతుందన్నారు. క్రీడాకారులు గెలుపే లక్ష్యంగా ముందుకు సాగా లన్నారు. కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ వసుంధర యాదవ్, డీఎస్పీ విజయ్ కుమార్, ఆర్‌యు కుమారస్వామి పాల్గొన్నారు. సాయంత్రం జరిగిన జూడో, యోగా, బాడీ బిల్డింగ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు మల్టీ జోన్‌వన్ ఐజీఎస్ చంద్రశేఖర్ రెడ్డి పతకాలను ప్రదానం చేశారు.

● నేడు క్వార్టర్ ఫైనల్స్, సెమీ ఫైనల్స్, ఫైనల్స్ మ్యాచ్‌లు...

మూడు రోజులుగా నిర్వహిస్తున్న పోలీస్ రాష్ట్రస్థాయి క్రీడలు చివరి దశకు చేరాయి. ఖో-ఖో పోటీల్లో క్వార్టర్ ఫైనల్‌కు పోటీలు చేరాయి. కబడ్డీ, బాస్కెట్‌బాల్ క్రీడాంశాల్లో పోటీలు సెమీ ఫైనల్స్‌కు చేరాయి. వాలీబాల్, హాకీ పోటీలు క్వార్టర్స్ ఫైనల్‌కు చేరాయి. శుక్రవారం అన్ని క్రీడాంశాల్లో క్వార్టర్ ఫైనల్స్ సెమీ ఫైనల్స్, ఫైనల్స్ మ్యాచ్‌లను నిర్వహించనున్నారు.

శనివారం రాష్ట్రస్థాయి పోటీల ముగింపు ఉత్సవాన్ని నిర్వహించనున్నారు.



వాలీబాల్ పోటీ



పోలీస్ జట్ల మధ్య టగ్‌ఆఫ్ వార్



దేహదారుఢ్య పోటీల్లో పోలీస్ క్రీడాకారులు

కల సాకారమవుతున్న వేళ

● గోదావరినదిపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి అటవీశాఖ అనుమతి

● డిసెంబరులో శంకుస్థాపన చేసిన సీఎం రేవంత్‌రెడ్డి

● అనుమతుల కోసం మంత్రి శ్రీధర్‌బాబు ప్రత్యేక కృషి


మంథని, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మంథని పట్టణ శివారులోని గోదావరి నదిపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి ఎట్టకేలకు కేంద్ర అటవీశాఖ కండిషనల్ క్లియరెన్స్ ఇచ్చింది. పెద్దపల్లి-మంచిర్యాల జిల్లాలను కలుపుతూ మంథని-శివ్వారం మధ్య ఉన్న గోదావరి నదిపై భారీ వంతెన నిర్మాణానికి అనుమతులు వచ్చాయి. దాదాపు రూ. 125 కోట్ల వ్యయంతో నిర్మించే ఈ బ్రిడ్జికి సీఎం రేవంత్‌రెడ్డి జిల్లా పర్యటన సందర్భంగా డిసెంబరు 4న శంస్థాపన చేశారు.

దాదాపు ఏడాది క్రితమే రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి మంథనిలో గోదావరి నదిపై భారీ వంతెనను నిర్మించి మంచి ర్యాల-పెద్దపల్లి జిల్లాల ప్రజలకు రవాణా సౌకర్యాన్ని కల్పిస్తామని ప్రకటించారు.గోదావరినదిలో ఎల్. మడుగు వన్యప్రాణుల-మొసళ్ల సంరక్షణ కేంద్రం ఉండటంతో బ్రిడ్జి నిర్మాణానికి ఫారెస్టు క్లియరెన్స్ రావడంపై కొంత సందిగ్ధత ఏర్పడింది. అప్పటి నుంచి వంతెన నిర్మాణానికి రూ. 125 కోట్ల నిధులు మంజూరు, అటవీశాఖ అనుమతి కోసం ప్రత్యేక శ్రద్ధతో కృషి చేయడంతో చివరకు ఫారెస్టు క్లియరెన్సర్స్ సైతం వచ్చింది. పలుమార్లు సీఎం రేవంత్‌రెడ్డితో ఢిల్లీ టూర్‌లో సైతం మంత్రి శ్రీధర్‌బాబు కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రిని కలిసి ఫారెస్టు క్లియర్స్ కోసం వినతిపత్రాన్ని ఇచ్చారు. ఆ తర్వాత గోదావరినదిపై వంతెన నిర్మాణంపై వేగవంతంగా కదలికలు వచ్చాయి. ఈ క్రమంలో కేంద్ర అటవీశాఖ ద్వారా షరతులతో కూడిన అనుమతులు లభించాయి.

ముచ్చటగా మూడు బ్రిడ్జిలు..

గోదావరి నదిపై ఇప్పటికే కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మంథని మండలం లోని సిరిపురం వద్ద సుందిళ్ల బ్యారేజీ కం బ్రిడ్జిని నిర్మించారు. మహారాష్ట్ర నుంచి వరంగల్-విజయవాడకు నూతనంగా నిర్మిస్తున్న నేషనల్ గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంలో భాగంగా మండలం లోని విలోచవరం గ్రామ శివారులోని గోదావరి నదిపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం జరగనుంది. మంథని మండలంలోని కన్నాల, పందులపల్లి, పుట్టపాక గ్రామ శివారుల్లో ఇప్పటికే హైవే పనులు ప్రారంభమయ్యాయి. హైవే బ్రిడ్జితో నదిపై రెండో వంతెన నిర్మాణం కానుంది. పట్టణ శివారులోని తాజాగా అటవీశాఖ అనుమతితో గోదావరినదిపై ముచ్చటగా మూడో భారీ వంతెన నిర్మాణం కానుంది.

మొసళ్ల సంచారానికి ఇబ్బందులు కలగకుండా..



గోదావరినదిలో వన్యప్రాణి మొసళ్ల సంరక్షణ కేంద్రం ఉండటంతో వంతెన నిర్మాణానికి కేంద్ర అటవీ శాఖ షరతులతో కూడిన అను మతులను ఇచ్చారు. బ్రిడ్జి నిర్మాణం అయ్యే స్థలంలో ఎలాంటి ఫారెస్టు భూమి లేకపోవడంతో వన్యప్రాణి సంరక్షణ కేంద్రాన్ని దృష్టిలో ఉంచుకొని నదిలో ఉండే మొసళ్ల సంచారానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు మాత్రమే నిర్మాణ పను లు చేపట్టాలని అటవీశాఖ నిబంధనలు విధించింది. వాటిని అతిక్రమిస్తే వన్యప్రాణి చట్టం ప్రకారం చర్యలు ఉంటాయని వెల్లడించారు.

లోకి వచ్చింది. తాజాగా మంథని- శివ్వారం మధ్య గోదావరి నదిపై వంతెన, నేషనల్ గ్రీన్‌ఫీల్డు హైవేలో భాగంగా విలోచవరం-గోపాల్‌పూర్ గ్రామాల మధ్య మరో వంతెన నిర్మాణం కానుంది. ఈ రెండు వంతెనలతో మొత్తం మూడు వంతెనల ద్వారా మరో ఏడాదిలో మంచిర్యాల జిల్లాకు, జైపూర్, చెన్నూర్ మీదుగా మహారాష్ట్ర, అక్కడి నుంచి చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు వెళ్లడానికి పెద్దపల్లి జిల్లా ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగు పడనుంది.

రెండు జిల్లాలు, రాష్ట్రాలకు రవాణా సౌకర్యం

గోదావరినదిపై అందుబాటులోకి రానున్న మూడు బ్రిడ్జిలతో పెద్దపల్లి,మంచిర్యాల జిల్లాలతోపాటు మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు పెద్దపల్లి జిల్లాల ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడనుంది. మంథని నియోజకవర్గానికి సరిహద్దుగా మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు, మంచిర్యాల జిల్లాలకు వెళ్లాలంటే గోదావరినది అడ్డుగా ఉండేది. గోదావరిఖని, కాళేశ్వరం వద్ద మాత్రమే గోదావరినది దాటడానికి బ్రిడ్జిలు అందుబాటులో ఉండగా ఇటీవల సుందిళ్ల వద్ద బ్రిడ్జి అందుబాటు

వ్యాపార-వాణిజ్య వర్గాలకు ఊరట..

జిల్లా విభజన తర్వాత నియోజకవర్గ కేంద్రమైన మంథనిలో వ్యాపార-వాణిజ్య వర్గాలకు గిరాకీలు పడిపోయాయి. మంథని డివిజన్ (నియోజకవర్గం)లోని ఐదు మండలాలు భూపాలపల్లి జిల్లాలో పరిపాలన పరంగా కలపడంతో ప్రజలు వివిధ పనుల నిమిత్తం మంథనికి రావడం తగ్గిపోయింది. నదిపై వంతెన నిర్మాణం పూర్తి అయితే గోదావరినది అవతలి వైపు ఉన్న జైపూర్ మండలంలోని పలు గ్రామాలు మంథనికి అతి చేరువుగా ఉండటంతో పాటు అంతర్ జిల్లాలు, అంతర్ రాష్ట్రాల ప్రజల రవాణా కారణంగా తమ వ్యాపారాలు పుంజుకునే అవకాశం ఉంది.



గోదావరి నది

జాతీయ సమైక్యత శిబిరానికి గురుకుల విద్యార్థిని

కరీంనగర్ రూరల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి11 నుంచి 17వరకు బెంగుళూరులో నిర్వహించనున్న జాతీయ సమైఖ్యతా శిబిరానికి కరీంనగర్ మండలం నగునూర్ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల విద్యార్థిని జి పుష్పలత ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ టి మాలతి తెలిపారు. కళాశాల జాతీయ సేవా పథకం వలంటీర్ డిగ్రీ బీఏ తృతీయ సంవత్సరం చదువుతున్న పుష్పలత జాతీయ సమైఖ్యతా శిబిరానికి ఎంపిక కావడం పట్ల కళాశాల అధ్యాపకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఎస్ పద్మజ, ఎర్రోజు వెంకటేశ్వర్లు, టి సురేష్‌కుమార్, జాతీయ సేవా పథకం ప్రోగ్రాం ఆఫీసర్ కె గీతారాణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపల్ మాలతి

గ్రామీణ స్థాయి నుంచి జాతీయ స్థాయికి..

● పోలీస్ శాఖలో ఉద్యోగం సాధించిన క్రీడాకారులు

● రాష్ట్ర స్థాయి క్రీడల్లో సత్తా చాటుతున్న సూర్యాపేట జిల్లా వేంపటి కబడ్డీ ప్లేయర్స్

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): వారందరూ గ్రామీణ క్రీడాకారులు.. అంది వచ్చిన అవకాశాన్ని సద్వినియోగపరుచుకున్నారు. కుటుంబ సభ్యుల అండ, కోచ్‌ల శిక్షణతో కబడ్డీలో జాతీయస్థాయికి ఎదిగారు. పోలీస్ శాఖలో ఉద్యోగులుగా చేరారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని పరేడ్ మైదానంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడల్లో సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం వేంపటి గ్రామానికి చెందిన ఐదుగురు కబడ్డీ క్రీడాకారులు సత్తా చాటుతున్నారు. వీరు యాదాద్రి జోన్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న వీరుతమ జట్టు విజయంలో కీలకపాత్ర పోషిస్తున్నారు.

● చిన్ననాటి నుంచి ఆసక్తి..

- గుండగాని శ్రావణి, ఎస్ఐ, హైదరాబాద్ సిటీ



కబడ్డీలో చిన్ననాటి నుంచి ఆసక్తి ఉంది. కోచ్‌ల సహకారంతో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారిణిగా ఎదిగాను. పలు జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో తెలంగాణ రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించాను. ఫలితంగా స్పోర్ట్స్ కోటాలో ఎస్ఐగా ఉద్యోగం వచ్చింది. హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నాను.

● జాతీయ స్థాయిలో రాణించేందుకు కృషి

- కె సుధీర్, హెడ్ కానిస్టేబుల్



ఎలాంటి క్రీడానేపథ్యంలేని కుటుంబం మాది. తోటి క్రీడాకారులు కబడ్డీ ఆడుతుండడం చూసి కబడ్డీ నేర్చుకున్నాను. రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించాను. పోలీస్ ఉద్యోగం సంపాదించాను. యాదాద్రి జోన్‌కబడ్డీజట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాను. పోలీస్ జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు కృషి చేస్తాను.

● జట్టు విజయంలో కీలకపాత్ర...

- కొమురెల్లి, కానిస్టేబుల్, హైదరాబాద్



పలు రాష్ట్ర, జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొన్నాను. సూర్యాపేట నుంచి మేము జాతీయ క్రీడాకారులుగా ఎదిగాం. రాష్ట్రస్థాయి పోలీస్‌క్రీడల్లో మాజట్టు విజయంలో కీలకపాత్ర పోషిస్తున్నాం.

● రాష్ట్రస్థాయి క్రీడలు నిర్వహించడం అభినందనీయం...

- ఆకుల నవీన్, పోలీస్ హెడ్‌కానిస్టేబుల్, సూర్యాపేట



కరీంనగర్ జిల్లా కేంద్రంలో కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో మూడవ తెలంగాణ రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడలు నిర్వహించడం అభినందనీయం. చాలా సంవత్సరాల తర్వాత పోలీస్ క్రీడలను నిర్వహిస్తున్నారు. రాష్ట్ర పోటీల్లో ప్రతిభచాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యేందుకు కృషి చేస్తాం.

రాజకీయ పార్టీ ఫ్లెక్సీల తొలగింపు

మంథని, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో మంథని మున్సిపల్ కమిషనర్ మనోహర్ ఆదేశాల మేరకు పట్టణంలో ఫ్లెక్సీలను మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బంది గురువారం తొలగించారు. స్థానికంగా పాత పెట్రోల్ పంపు, అంబేద్కర్‌చౌక్, శ్రీపాద చౌక్, బస్టాండ్ ఏరియా, డిపో ఏరియా, గాంధీచౌక్ తోపాటు మున్సిపల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ రాజకీయ పార్టీల నేతల, ఇతర ఫ్లెక్సీలను మున్సిపల్ సిబ్బంది తొలగించారు. పలువురు రాజకీయ పార్టీల నేతల విగ్రహాలకు ముసుగులు తొడిగారు. శిలాఫలకాల మీద పేపర్ల అంటించారు. ఎలక్షన్ కోడ్‌ను మున్సిపల్ అధికారులు కట్టుదిట్టంగా అమలు చేస్తున్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

కమాన్‌పూర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై ఎస్ఐ కొట్టే ప్రసాద్ అవగాహన కల్పించారు. రామగిరి మండలం కల్వచర్లలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు కమాన్‌పూర్ మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ట్రాఫిక్ నియమాలు పాటించి పోలీస్‌లకు సహకరించాలని విద్యార్థులు పాటల ద్వారా తెలియజేశారు. ఐదో తరగతి విద్యార్థి రిత్విక్ యమధర్మరాజు వేషంలో ఆకట్టుకున్నాడు. ఈసందర్భంగా ఎస్ఐ కొట్టే ప్రసాద్ మాట్లాడుతూ ట్రాఫిక్ నియమ నిబంధనల గురించి విద్యార్థులు బాగా వివరించారన్నారు. పాఠశాల హెచ్ఎం బర్ల శ్రీనివాస్, కమాన్‌పూర్ పీఎస్ఐ రవళి, డైరెక్టర్లు అనిల్ కుమార్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

మహాత్మా గాంధీకి ఘన నివాళి




పెద్దపల్లి, గోదావరిఖనిలో మహాత్మాగాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



సుల్తానాబాద్‌లో ఆర్యవైశ్య సంఘం నాయకులు..

పెద్దపల్లి కల్చరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా పలువురు నాయకులు, వైశ్య సంఘం ప్రతినిధులు మహాత్మా గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ విగ్రహానికి పూలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సత్యాగ్రహ మే ఆయుధంగా, అహింస మార్గంలో నడిచి దేశానికి స్వాతంత్ర్యం తెచ్చారని కొనియాడారు.

పెద్దపల్లిపట్టణంలో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు భూషణవేణి సురేష్‌గౌడ్, మాజీ కౌన్సిలర్లు తూముల సుభాష్, బూతగడ్డ సంపత్, సోనీ శ్రీకాంత్, ఎరుకల కల్పనా రమేష్, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దొడ్డుపల్లి జగదీష్, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బొడ్డుపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎలిగేడు: మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన కార్యదర్శి దుగ్యాల సంతోష్‌రావు, మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ గోపు విజయభాస్కర్‌రెడ్డి, ఆర్యవైశ్య సంఘం మండల ప్రధాన కార్యదర్శి తాటిపల్లి సతీష్‌బాబు, నాయకులు కేశెట్టి నాగభూషణం, కేశెట్టి రాఘవేంద్ర, రాజేశం, న్యాతరి పోచయ్య, బాపయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణ్‌నగర్: గోదావరిఖని చౌరస్తాలో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షుడు తిప్పారపు శ్రీనివాస్, నాయకులు కొలిపాక సుజాత, గట్ల రమేష్, సుతారి లక్ష్మణ్‌బాబు, బొమ్మక రాజేష్, గడ్డం శ్రీనివాస్, కళ్యాణి సింహాచలం, చుక్కల శ్రీనివా స్, ఆడెపు దశరథం, దాసరి విజయ్, దాసరి సాంబ మూర్తి, కీర్తి నాగరాజు, మాలెం మధు పాల్గొన్నారు.

కోల్‌సిటీటౌన్: స్థానిక మార్కండేయకాలనీలోని గాంధీ డిగ్రీ, పీజీ కళాశాలలో పెద్దపల్లి జిల్లా నెహ్రూ యువ కేంద్రం, గాంధీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ ఎం వెంకటేశ్వర్‌రావు, ప్రిన్సిపల్ యు రవీందర్, అధ్యాపకులు, విద్యార్థులు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ధర్మారం: మండలంలో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతి రెడ్డి, ఏఎంసీ చైర్మన్ లావుడ్య రూప్లా నాయక్, మాజీ ఏఎంసీ చైర్మన్ కొత్త నర్సింహులు, బీఆర్ఎస్ అధ్యక్షుడు రాసూరి శ్రీధర్, నాయకులు ముత్యాల బలరాం రెడ్డి, పూస్కూరి జితేందర్‌రావు, కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అడ్మినిస్ట్రేట్ వైస్ ప్రెసిడెంట్ సిరిపురం సత్యనారాయణ, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు తలమక్కి రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

సుల్తానాబాద్: మండలంలో జరిగిన కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షుడు కొమురవెళ్లి రాంమూర్తి, అధ్యక్షుడు కొమురవెళ్లి భాస్కర్, ప్రధాన కార్యదర్శి తొడపునూరి రాజేంద్రప్రసాద్, కేబీ శ్రీనివాస్, అల్లంకి లింగమూర్తి, పల్లా కిషన్, అల్లెంకి సత్తన్న రామిడి శ్రీనివాస్, అనిల్ పాల్గొన్నారు.

జూలపల్లి: మండలకేంద్రంలోని ప్రాథమిక వైద్యఆరోగ్య కేంద్రంలో మహాత్మాగాంధీ వర్ధంతిని నిర్వహించారు. కుష్ఠువ్యాధి నిర్మూలన కోసం మండల వైద్యాధికారి సంపత్‌రెడ్డి ప్రతిజ్ఞ చేయించారు.

యైటింక్లయిన్‌కాలనీ: కాలనీలో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేష్, నాయకులు మారెల్లి రాజిరెడ్డి, జక్కుల దామోదర్‌రావు, చాట్ల సదానందం, చక్రపాణి, తిరుపతి, కేశవులు, రాములు, తిరుపతిరెడ్డి, రాజిరెడ్డి,రాజేశం పాల్గొన్నారు.

నిఘా నీడలో ఇంటర్ ప్రాక్టికల్స్

(5వ పేజీ తరువాయి)

ప్రాక్టికల్ పరికరాలు, రసాయనాలు తెప్పించుకునే పనిలో నిమగ్నమయ్యారు

● **వ్యతిరేకిస్తున్న ప్రైవేట్ కళాశాల యాజమాన్యాలు..**

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలను సీసీ కెమెరాల నిఘాలో నిర్వహించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తెలంగాణ ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాల సంఘం వ్యతిరేకిస్తున్నది. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయవద్దని, సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు నిర్వహించాలనే నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఇంటర్ బోర్డు కార్యదర్శి తీరు సరిగా లేదని, ఆయనను బోర్డు నుంచి తప్పించాలని, లేకుంటే బోర్డు పరీక్షల కోసం తమ కళాశాలల్లో పరీక్షా కేంద్రాల ఏర్పాటుకు సహకరించబోమని హెచ్చరించారు. ఈ విషయమై ప్రభుత్వం ముందుకే వెళుతుందా, వెనక్కి తగ్గుతుందా చూడాలి.

పరీక్షలపై నిఘా పెంచేందుకే..

- కల్పన, డీఐఈవో పెద్దపల్లి



ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలపై ఈసారి బోర్డు అధికారులు సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు, రెసిడెన్షియల్ కళాశాలలేవరైనా ప్రతీ ల్యాబ్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సిందే. ప్రతీ సీసీ కెమెరాపై బోర్డు ఉన్నతాధికారుల నిఘా ఉంటుంది. ఉన్నతాధికా రుల ఆదేశాలను ప్రతీకళాశాల యాజమాన్యాలు పాటించాలి. జిల్లాలోని ప్రభుత్వ కళాశాలల్లో సీసీ కెమెరాల బిగింపు పూర్తి కావస్తున్నది.

బండి సంజయ్ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి

కళ్యాణ్‌నగర్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ప్రజా యుద్ధ నౌక గద్దర్‌పై కేంద్ర మంత్రి బండిసంజయ్ చేసిన వాఖ్యలను వెంటనే ఉప సంహరించుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేకపోతే సంజయ్‌కి తగిన బుద్ధి చెబుతామని మాల మహానాడు నాయకులు, రామగుండం కళాకారులు బొమ్మక వెంకటేశ్వర్లు, శ్రీహరి హెచ్చరించారు. గురువారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ దేశంలో జనంలో చైతన్యం తీసుకురావడానికి గద్దర్ జీవితాన్ని త్యాగం చేశారని, కేంద్ర మంత్రి బండి సంజయ్ గద్దర్‌పై అనుచిత వాఖ్యలు చేయడం సరికాదని, తెలంగాణ ఉద్యమంలో గద్దర్ కీలకపాత్ర పోషించారన్నారు. బీజేపీ నాయకురాలు రాణి రుద్రమ వాఖ్యలను వారు తప్పుబట్టారు. మహిళలు సాధికారికత సాధించాలని గద్దర్ తపన పడుతూ ఉండేవారని, కేంద్ర మంత్రి బండి సంజయ్ కనీస పరిజ్ఞానం లేకుండా వాఖ్యలు చేశారన్నారు. సంజయ్ దేశంలో ఎక్కడ తిరిగినా మాల వీరులు అడ్డుకుంటారన్నారు. విలేకరుల సమావేశంలో సోగాల వెంకటి, కొండ కుమార్, మర్రి ఐలయ్య, ఎరుకల లక్ష్మణ్, లింగమూర్తి, కిష్టయ్య, రామస్వామి, రాములు, భీంసేన్ పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల నిర్వహణకు సన్నద్ధంగా ఉండాలి

- కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు సన్నద్ధంగా ఉండాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు జే అరుణశ్రీ, డి వేణుతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పంచాయతీ స్థానికసంస్థల ఎన్నికలకు త్వరలో నోటిఫికేషన్ రానున్న నేపథ్యంలో ఎంపీటీసీ పరిధి చెక్ చేసుకోవాలని, ఎంపీడీవోలు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి అవసరమైన బ్యాలెట్ పత్రాలు, బాక్సులు స్ట్రాంగ్ రూమ్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. స్థానిక పరిస్థితుల ఆధారంగా పోలింగ్ కేంద్రాలను విభజించాలని, క్రిటికల్ పోలింగ్ కేంద్రాల వద్ద అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. అనంతరం ఇటీవల మృతి చెందిన అంతర్గాం ఎంపీడీవో అలీముద్దీన్ ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ కలెక్టర్, ఎంపీడీవోలు, ఇతర అధికారులు రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. సమావేశంలో డీపీవో వీర బుచ్చయ్య, జడ్పీ సీఈవో నరేందర్, హౌసింగ్ ఈఈ రాజేశ్వర్, ఎన్నికల నోడల్ అధికారులు, డీఎల్‌పీఓలు, ఎంపీడీఓలు, ఎంపీవోలు, తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లి రూరల్: నూతన ఎంపీడీవో కార్యాలయం వద్ద అవసరమైన వసతులు ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష పెద్దపల్లి రైల్వేస్టేషన్ రోడ్ సమీపంలోని భవనంలోకి నూతనంగా తరలించిన ఎంపీడీవో కార్యాలయాన్ని పరిశీలించారు. నూతన కార్యాలయం వద్ద అవసరమైన వసతులు కల్పనకు ప్రతిపాదనలు అందించాలని అధికారులను ఆదేశించారు. జడ్పీ సీఈవో నరేందర్, ఎంపీడీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



డ్రై రిసోర్స్ సెంటర్ వద్ద పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

అనుమతి లేకుండా నిర్మాణాలు చేపడతే తొలగించండి..

కోల్‌సిటీ: రామగుండం కార్పొరేషన్‌లో అనుమతి లేకుండా కట్టడాలు నిర్మిస్తే వెంటనే తొలగించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష కార్పొరేషన్ అధికారులకు సూచించారు. గురువారం రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ అరుణశ్రీతో కలిసి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్‌లో ఎవరైన టౌన్ ప్లానింగ్ అనుమతి లేకుండా అక్రమంగా నిర్మాణాలు చేపడితే వాటిని కూల్చివేయాలని ఆదేశించారు. టీయూఎఫ్ఐడీసీ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలన్నారు. పారిశుధ్య నిర్వహణ కోసం కొనుగోలు చేసిన ఆటోలు, ట్రాక్టర్లను పూర్తి స్థాయిలో వినియోగించాలన్నారు. నిర్దేశించిన ఆస్తి పన్ను లక్ష్యం మార్చి నాటికి వసూలు చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం శాంతినగర్‌లోని సెంటర్ డ్రై రిసోర్స్ సెంటర్, మేడిపల్లి డంప్ యార్డ్‌లను పరిశీలించారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ రాయలింగు, ఎస్ఈ శివానంద్, ఈఈ రామన్, పబ్బాల శ్రీనివాస్‌తో పాటు ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

● **డార్క్ స్పాట్ లేకుండా చర్యలు**

కోల్‌సిటీ: రామగుండం కార్పొరేషన్‌లో ఫిబ్రవరి 15నాటికి డార్క్ స్పాట్ లేకుండా చర్యలు చేపట్టినట్లు కలెక్టర్, నగరపాలక సంస్థ ప్రత్యేకాధికారి కోయ శ్రీహర్ష చెప్పారు. గురువారం కార్పొరేషన్‌లో అధికారుల పనితీరుపై సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో ఎక్కడా చీకటి ప్రదేశం లేకుండా రూ.1.3కోట్లతో 300విద్యుత్ స్థంబాలు 200 విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయనున్నట్లు, ఈ పనులు ఫిబ్రవరి 15వరకు పూర్తి చేస్తామని తెలిపారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపట్టామని వివరించారు.

గంజాయి పట్టివేత

కమాన్‌పూర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గురువారం పోలీసులు తనిఖీలు చేయగా ఓ వ్యక్తి వద్ద గంజాయి పట్టుబడింది. పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా పొనగంటి అక్షిత్ అనే వ్యక్తి పోలీసులను చూసి పరుగెత్తగా అతన్ని పట్టుకున్నారు. అతని వద్ద 50 గ్రాముల గంజాయి పట్టుబడింది. అతడిని విచారించగా కల్వచర్ల గ్రామానికి చెందిన చిప్పకుర్తి అజిత్ అనే వ్యక్తి వద్ద 300 గ్రాములు గంజాయిని కొన్నట్లు తెలిపాడు. జూలపల్లిలో అమ్మడానికి వస్తూ పోలీసులకు పట్టుబడ్డాడు. ఎస్సై ప్రసాద్, ఎస్సై 2 జె రవలి, కానిస్టేబుల్ సతీష్, రమీజ్, శ్రీనివాస్ ఉన్నారు.

మంథని రూరల్ (ఆంధ్రజ్యోతి): గంజాయి కలిగి ఉన్న వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు గురువారం తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం మంథని పట్టణంలోని శ్రీపాద కాలనీకి చెందిన తైదాల సురేష్, తుత్తుర్ల మహేష్ అనే వ్యక్తులు మండలంలోని ఎగ్లాసుపూర్ సమీపంలోని గాడుదుల గండి గుట్ట వద్ద అనుమానాస్పదంగా పోలీసులకు కనిపించడంతో వారిని తనిఖీ చేయగా వారి వద్ద ఉన్న కవర్ లో కొంత గంజాయి, నాలుగువేల నగదు లభ్యమైందని పోలీసులు తెలిపారు. వారిని ప్రశ్నించగా తామతో పాటు రవి, సాగర్ కిరణ్, యశ్వంత్, గోవింద్ సింగ్, ఆంకూస్ ఆనే వ్యక్తులకు గంజాయి తాగే అలవాటు ఉందాని వీరందరూ ఏడువేల రూపాయలకు హైదరాబాద్‌లో 500 గ్రాముల గంజాయి కొనుగోలు చేసి ఇందులో కొంత గంజాయి నాలుగువేల రూపాయలకు వేరే వ్యక్తులకు విక్రయించారని తెలిపారు. మిగిలిన గంజాయి సేవించేందుకు సురేష్, మహేష్ గుట్ట వద్దకు వచ్చినట్లు పోలీసులు వెల్లడించారు. వీరందరిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బొంతల రాజేష్‌కు మంత్రి పొన్నం పరామర్శ



బొంతల రాజేష్‌తో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

గోదావరిఖని, జనవరి 30(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న కాంగ్రెస్ నగర అధ్యక్షుడు బొంతల రాజేష్‌ను గురువారం సాయంత్రం తిలక్‌నగర్‌లోని ఆయన నివాసంలో రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఆకారపు భాస్కర్‌రెడ్డితో కలిసి పరామార్శించారు. బొంతల రాజేష్ త్వరగా కోలువాలని ఆయన ఆకాంక్షించారు. కాల్వ లింగస్వామి, మహం కాళి స్వామి, దీటి బాలరాజు, తిప్పారపు శ్రీనివాస్, గుమ్మడి కుమారస్వామి, సుతారి లక్ష్మణ్‌బాబు, గట్ల రమేష్, గడ్డం శ్రీనివాస్, మిడిదొడ్డి ప్రవీణ్ తదితరులు ఉన్నారు.



మెడికల్ కార్డుల దరఖాస్తుకు గడువు పొడిగింపు

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 30(ఆంధ్రజ్యోతి): సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల వైద్య సేవలకు గాను కంట్రిబ్యూటరీ పోస్టు రిటైర్మెంట్ మెడికేర్ స్కీం సభ్యత్వం దరఖాస్తు గడువును పొడిగిస్తున్నట్లు ఆర్జీ-2 జీఎం వెంకటయ్య ప్రకటనలో పేర్కొన్నారు. మార్చి 31వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవాలని జీఎం సూచించారు. ఇప్పటికే కార్డు ఉన్న వారు లైవ్ సర్టిఫికేట్‌ను ప్రతి సంవత్సరం నవంబరు నెలలో మీసేవా ద్వారా ఆన్‌లైన్‌లో సమర్పించాలని జీఎం సూచించారు.

ఓసీపీ-3ని సందర్శించిన డైరెక్టర్(ఈఅండ్ఎం)

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 30(ఆంధ్రజ్యోతి): సింగరేణి డైరెక్టర్ (ఈఅండ్ఎం, ఆపరేషన్స్) సత్యనారాయణరావు గురువారం ఓసీపీ-3 ప్రాజెక్టును సందర్శించారు. వ్యూపాయింట్ ద్వారా ప్రాజెక్టు పనులను పరిశీలించిన ఆయన ప్రాజెక్టులో పని స్థలాలను పరిశీలించారు. పీఓ ఆఫీస్‌లో అధికారులతో సమావేశమయ్యారు. వార్షిక లక్ష్యాలను సాధించటానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు డైరెక్టర్ పలు సూచనలు చేశారు. వార్షిక సంవత్సరం దగ్గర పడుతున్నందున రోజువారి టార్గెట్‌లను సాధించాలని సూచించారు. ఆర్జీ-2 జీఎం బండి వెంకటయ్య, ఏరియా ఇంజనీర్ నర్సింహారావు, పీఓ మధుసూదన్, పీఈ రాజాజీతో పాటు ప్రాజెక్టు అధికారులు ఉన్నారు.

అమరవీరుల సంస్మరణ దినోత్సవం



మౌనం పాటిస్తున్న అధికారులు, ఉద్యోగులు

గోదావరిఖని, జనవరి 30(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆర్జీ-1 ఏరియా జీఎం కార్యాలయంలో భారత స్వాతంత్ర్య పోరాటంలో ప్రాణాలు అర్పించిన వారి జ్ఞాపకార్థం గురువారం అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. మౌనం పాటించి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏరియా రక్షణ అధికారి సాయి ప్రసాద్, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరి ఆరెల్లి పోషం, సీఎంఓఐ ఇన్‌చార్జి క్రాంతి, జీఎం ఆఫీస్ ఇన్‌చార్జి రాజు, ఏరియా ఇంజనీర్ దాసరి వెంకటేశ్వర్ రావు, ఎన్విరాన్‌మెంట్ డీజీఎం ఆంజనేయ ప్రసాద్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్స్ బంగారు సారంగపాణి, శ్రావణ్ కుమార్, హన్మంతరావు, బీమా, వసంత్ కుమార్, వీరారెడ్డి, ఉమేష్, అక్బర్ అలీ పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ-2 జీఎం ఆఫీస్‌లో గురువారం అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్వోటూ జీఎం రాముడు, ఏఐటీయూసీ అసిస్టెంట్ బ్రాంచి సెక్రెటరీ శ్యాంసన్, అధికారులు ధనుంజయ, మురళీకృష్ణ, బుక్యదేశాయి, వెంకటరామచంద్ర, సునీత, సుభాష్, పండరీనాథ్, వేణుగోపాల్, వంశీధర్, వేణు, నవీన్‌తో పాటు జీఎం ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాభిప్రాయ సేకరణకు వ్యతిరేకంగా జేఏసీ ఏర్పాటు

జ్యోతినగర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ తెలంగాణ ప్రాజెక్టుకు సంబంధించి ఈనెల 28న జరిగిన ప్రజాభిప్రాయ సేకరణకు వ్యతిరేకంగా పోరాడేందుకు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా, కార్మిక సంఘాలతో ఐక్య కార్యాచరణ కమిటీ (జేఏసీ)ని ఏర్పాటు చేశారు. మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆధ్వర్యంలో గురువారం జరిగిన అఖిలపక్ష సమావేశంలో జేఏసీని ఏర్పాటు చేశారు. ప్రభావిత ప్రజల భాగస్వామ్యం లేకుండా ప్రజాభిప్రాయ సేకరణ చేశారని ఈ సందర్భంగా కోరుకంటి చందర్ అన్నారు. ప్రభావిత గ్రామాల ప్రజల లేకుండానే నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్టీపీసీ నిరిళిస్తున్న 2400 మెగావాట్ల టిఎస్‌టిపిపి స్టేజ్ 2 వల్ల ఈ ప్రాంతం మరింత కాలుష్యం బారిన పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాభిప్రాయ సేకరణకు వ్యతిరేకంగా ఉద్యమించేందుకు అఖిల పక్షంతో ఉద్యమించాల్సి ఉందని, అందుకే జేఏసీని ఏర్పాటు చేశామన్నారు. కాగా, జేఏసీలో కోరుకంటి చందర్, బీజేపీ నేత బల్మూరి అమరేందర్‌రావు, న్యూ డెమోక్రసి నుంచి ఇ.నరేష్, బీఎస్పీ నుంచి ఇరికిల్ల శంకర్, టిడిపి నుంచి దామోదర్‌రెడ్డి, న్యూ ఇండియా పార్టీ నుంచి జే.వి.రాజు, సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ నుంచి జూపాక శ్రీనివాస్, తోకల రమేష్, పర్యావరణ పరిరక్షణ వేదిక నుంచి దహగాం ఉమామహేశ్వర్‌రావు, ఎన్‌సీపీ నుంచి మేకల శ్రధర్, మాజీ కార్పొరేటర్లు కుమ్మరి శ్రీనివాస్, కృష్ణవేణి, నాయకులు నారాయణదాసు, మారుతి, శంకర్‌గౌడ్‌లను ప్రతినిధులుగా నియమించారు.

పదోన్నతులతో బాధ్యత పెరుగుతుంది: సీపీ

కోల్‌సిటీ, జనవరి 30(ఆంధ్రజ్యోతి): పోలీస్‌శాఖలో పదోన్నతుల ద్వారా మరింత బాధ్యత పెరుగుతుందని రామగుండం సీపీ శ్రీనివాస్ అన్నారు. కమిషనరేట్‌లో పని చేస్తున్న ఆరుగురు ఏఆర్ కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి రావడంతో వారికి చిహ్నాలను సీపీ బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదోన్నతులతో గుర్తింపు, ఉత్సాహం వస్తుందని, ఎలాంటి రిమార్కులు లేకుండా మిగిలిన సర్వీసును పూర్తి చేసి విధుల్లో మంచి పేరు, ప్రఖ్యాతలను పెంపొందించుకోవాలన్నారు. క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ ప్రజల్లో పోలీస్‌శాఖ పట్ల నమ్మకాన్ని, గౌరవాన్ని పెంచే విధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ(అడ్మిన్) రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, ఏఆర్ ఏసీపీ సుందర్‌రావు, ఆర్ఐ వామనమూర్తి, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు బోర్లకుంట పోచలింగం, స్వామి తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధి నిర్మూలనలో భాగస్వాములు కావాలి

సుల్తానాబాద్, జనవరి 30 (ఆంధ్రజ్యో తి): కుష్ఠు వ్యాధి నిర్మూలనలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని గర్రెపల్లి ప్రభుత్వ ప్రాదమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రుక్మిణి, ఉదయ కిరణ్ అన్నారు. జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలన కార్యక్రమం లో భాగంగా అన్ని గ్రామాల్లో వ్యాధిని గుర్తించడం, పేషంట్లకు సరైన చికిత్సలు సకాలంలో అందించడం ద్వారా వ్యాధి నిర్మూలన చేయవచ్చన్నారు. చేసి తీరాలని అన్నారు. మండలంలోని గర్రెపల్లి సాంఘిక సంక్షేమ శాఖ బాలికల గురుకుల కళాశాల తో పాటు మండలంలోని అన్ని విద్యాసంస్థ లు గురుకులాలలో అవగాహన ఉద్యమ కార్యక్రమం నిర్వహించారు.



సుల్తానాబాద్ మున్సిపల్ ఆఫీసులో ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగులు

● కుష్ఠు, టీబీ, తదితర వ్యాధులపై సుల్తానాబాద్ మున్సిపాలిటీ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రజలకు అవగాహన కల్పించారు. హెచ్ ఈవో అనిసొద్దిన్, మేనేజర్ అలీమొద్దీన్, ఏఎన్ఎంలు రమ సరస్వతి, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎలిగేడు: స్థానిక అంబేడ్కర్‌చౌక్‌లో మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా కుష్ఠు, టీబీ, లెప్రసి వ్యాధులపై ప్రజలకు వైద్య బృందం అవగాహన కల్పించింది. ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన చికిత్సలు అందిస్తున్నామని అన్ని మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అనంతరం కుష్ఠు వ్యాధి లక్షణాలను వివరించారు. ప్రజలందరు సుచి, శుభ్రత పాటిస్తే రుగ్మతలు దరి చేరవని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు నిస్సిక్రిష్టాన, హెల్త్ సూపర్‌వైజర్లు నాగమణి, లక్ష్మణ్, ఆశవర్కర్లు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

గోదావరిఖని/కోల్‌సిటీటౌన్: ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణమాదిగకు పద్మశ్రీ అవార్డు వచ్చిన సందర్భంగా బీజేపీ రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి గురువారం హైదరాబాద్‌లో కలిసి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. బీజే పీ ఓబీసీ రాష్ట్ర నాయకులు పిడుగు కృష్ణ ముదిరాజ్, నాయకులు కందుల పోషం పాల్గొన్నారు.

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థలో అసిస్టెంట్ కమిషనర్‌గా పని చేస్తూ మంచిర్యాల మందమర్రి మున్సిపాలిటీ కమిషనర్‌గా బదిలీ అయిన టీ రాజలింగును గురువారం అదనపు కలెక్టర్, కమిషనర్ అరుణశ్రీ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఈఈ రామన్, పబ్బాల శ్రీనివాస్, శంకర్‌రావు పాల్గొన్నారు.

ఎలిగేడు: మండలంలోని లోకపేటలో పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సోషల్ వెల్ఫేర్ అధికారి అంజయ్య మాట్లాడుతూ చట్టాలపై ప్రతి పౌరుడు అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై చంద్రమౌళి, ఆర్ఐ జయలక్ష్మి, వీసీ సతీష్, పంచాయతీ కార్యదర్శి మసీనోద్దీన్ గ్రామస్థులు పాల్గొన్నారు.

జూలపల్లి: మండలంలోని కోనరావ్‌పేటలో గురువారం ప్రభుత్వ అధికారులు పౌరహక్కులదినోత్సవం సందర్భంగా గ్రామసభ నిర్వహించారు. నాయబ్ తహసీల్దార్ అనిల్‌కుమార్, ఏఎస్ఐ రామ్ చంద్రయ్య, సీహెచ్ఓ కలీమ్, ఆర్ఐ సందీప్‌రెడ్డి, ప్రజలు పాల్గొన్నారు.

కమాన్‌పూర్: కమాన్‌పూర్ మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో గురువారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వాసంతి,కమాన్‌పూర్-2 ఎస్సై రవలి, ఆర్ఐ పాల్గొన్నారు.

పాలకుర్తి: పాలకుర్తి మండలం పరిధిలోని పుట్నూర్ గ్రామంలో గురువారం రెవెన్యూ అధికారులు, పోలీసులు పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఆర్ఐ ఇంతియాజ్, ఏఎస్ఐ మునీర్, ఎంపీవో ఉప్పు సుదర్శన్, పంచాయతీ కార్యదర్శి ఎస్ సుమలత,వార్డెన్ మెండె సంపత్ కుమార్,కారోబార్ గొళ్ల పెల్లి సతీష్ తదితరులుపాల్గొన్నారు.

పెద్దపల్లిటౌన్: ఆదివాసీ ఎరుకల సమస్యలను పరిష్కరించాలని ఆదివాసి ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షుడు అంగడి కుమారస్వామి కోరారు. గురువారం జిల్లా కేంద్రంలో నియోజకవర్గ స్థాయి సమావేశం మానుపాటి ఎల్లయ్య ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు హాజరై మాట్లాడుతూ జిల్లాలో ఆదివాసి ఎరుకల ప్రజలు విద్య ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక ఆర్థికంగా సామాజికంగా రాజకీయంగా వెనుకబడి ఉన్నారని ఆవేదన చెందారు.

పెద్దపల్లిటౌన్: రాష్ట్ర మాష్టి 45 కుల సంఘం అధ్యక్షుడిగా పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రానికి చెందిన దంతనపల్లి చిన స్వామిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఓదెల: మండలంలోని పలు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను గురువారం జిల్లా ప్రత్యేక బృందం తనిఖీలు నిర్వహించింది.

పెద్దపల్లి రూరల్: మండలంలోని నిమ్మనపల్లి పల్లవి మోడల్ స్కూల్ 4వ తరగతి విద్యార్థిని ఎస్.శ్రీఆద్య, 5వ తరగతికి చెందిన విహాన్‌లు ఎస్‌ఓపీ సెకండ్ లెవల్ అంతర్జాతీయ గణిత ఒలిం పియాడ్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ శోభారాణి తెలిపారు. ఫిబ్రవరి 9న కరీంనగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించే పోటీలకు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు స్రవంతి, షాజియా, సంతోష్, విద్యార్థులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్: సుల్తానాబాద్ ప్రభుత్వ అసుపత్రిలో ఉన్న రోగులకు, స్థానిక మానసిక వికలాంగుల పునరావాస కేంద్రంలో గురువారం పండ్ల పంపిణీ చేశారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద క్రిష్ణ మాదిగకు కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డును ప్రకటించిన సందర్భాన్ని పురస్కరించుకుని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు గుండా థామస్ మాదిగ ఆధ్వర్యంలో పండ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.

పెద్దపల్లిటౌన్: పెద్దపల్లి పట్టణంలోని పెద్దమ్మ తల్లి దేవాలయం గోడలకు ఉన్న ఆలయ నిర్మాణ దాతల పేర్లు ధ్వంసం చేశారని గురువారం నిర్మాణ దాతల మద్దతుదారులు ఆందోళన చేపట్టారు. గుడిలోకి ప్రవేశించి, ఆలయం గోడలకు ఉన్న ఆలయ నిర్మాణ దాతలు కొలిపాక నర్సయ్య, శంకరమ్మ పేర్లను ధ్వంసం చేసిన పెద్దపల్లి పట్టణానికి చెందిన భూతగడ్డ నరేష్, భూతగడ్డ రాజ్ కుమార్ లపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు జిల్లా సంఘం చైర్మన్ కలిపాక నర్సయ్య పిర్యాదు చేశారు.

జూలపల్లి: పశుసంరక్షన వాటి యొక్క చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి శంకర్ అన్నారు. మండలంలోని వడుకాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు గురువారం పశుల సంరక్షణ వాటి చట్టాలపై వివరించి అవగాహన కల్పించారు.

జ్యోతినగర్: జిల్లాలో పదవ తరగతిలో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణా తరగతులు గురువారం ప్రారంభమయ్యాయి. ఎన్టీపీసీ టీటీఎస్‌లోని జెడ్పీ స్కూల్‌లో జరిగిన శిక్షణా తరగతుల ప్రారంభ కార్యక్రమానికి జిల్లా విద్యాధికారి (డిఇవొ) మాధవి హాజరయ్యారు.

పాలకుర్తి: మండలం పరిధిలోని బామ్లానాయక్ తండా మాజీ సర్పంచ్ రాజునాయక్ ఆధ్వర్యంలో గురువారం రైతులు పెద్దపల్లి కలెక్టర్ చాంబర్‌లో అడిషనల్ కలెక్టర్‌ను కలిసి సన్న వడ్లకు బోనస్ డబ్బులు జమచేయాలని వినతిపత్రం అందించారు.